Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 23.02.2018, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 38 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com






## అనుభవశాలి ఈ... బాబు టెంపరరీ

- తాత్కాలిక భవనాలతో కాలయాపన
- ప్రచారం జాస్తి... ఫలితం నాస్తి
- శాశ్వతం అన్న మాటే కరువు

### ఏం అనుభవం... ఎందులో అనుభవం...?

చంద్రబాబు అంటే ఆలోచనాపరుడు, మేధావి, పాలనాదక్షుడు, అన్నింటినీ మించి అనుభవధీశాలి. ఇదీ నాలుగేళ్ళనాడు జరిగిన ఎన్నికల్లో ఆయనను ముఖ్యమంత్రిగా చేసిన వారి ఆలోచన.

బాబుకి ఎందులో అనుభవముంది...

- మానాభిమానాలు ప్రక్కనపెట్టి, తనకుమాలిన పనిలో వేలుపెట్టి 5కోట్ల ఆంధ్రుల పరువును తాకట్టుపెట్టి, పదేళ్ళ ఉమ్మడి పాలనకు సలాంకొట్టి అమరావతికి పారిపోయి రావడంలో అనుభవమా...?
- ఉన్నవి లేనట్లుగా లేనివి ఉన్నట్లుగా చూపడంలో అనుభవమా?
- మాయమాటలతో... మాంత్రిక లెక్కలతో తిమ్మిని బొమ్మిని చేసి చూపడంలో అనుభవమా...?
- తాత్కాలిక భవనాలకు వందలకోట్లు ఖర్చుపెట్టడంలో అనుభవమా..?
- వందల కోట్ల ప్యాకేజీలతో పక్క పార్టీవారిని ఆకర్షించడంలో అనుభవమా...?
- నిన్నొక మాట, నేడొక మాట, రేపొక మాట చెప్పి, చెప్పిన మాటను ఎప్పటికప్పుడు మర్చిపోవడంలో అనుభవమా...?
- గోరంతను కొండంత చేసి ప్రచారం చేసుకోవడంలో అనుభవమా...?

(మిగతా 11వ పేజీలో)



## విపిఆర్ ఖరార్

- ఇంకా తేలని బిఎంఆర్
- రాజ్యసభ రేస్‌లో నెల్లూరీయులు

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా నెల్లూరుజిల్లాకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, సేవాభిలాషి, దానగుణ సంపన్నుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని అధికారికంగా ఖరారు చేసేసారు. పార్టీలో కీలకపాత్ర పోషిస్తున్న వి.విజయసాయిరెడ్డి పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని వైసిపి ఎమ్మెల్యేలకు పరిచయం చేశారు.

2014 ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి వచ్చివుంటే అప్పుడే ఆయన రాజ్యసభ సభ్యుడయ్యుండేవాడు. అధికారంలోకి రాక, తగినంత ఎమ్మెల్యేల సంఖ్య లేక ఇంతకాలం వేచి చూడాల్సి వచ్చింది. మార్చిలో రాజ్యసభ ఎన్నికలు జరుగనున్నాయి. మన రాష్ట్రం నుండి ముగ్గురు సభ్యులను ఎన్నుకోవాల్సి వుండగా, ఎమ్మెల్యే సంఖ్యా బలాన్ని బట్టి తెలుగుదేశంకు రెండు, వైసిపికి ఒక స్థానం దక్కనున్నాయి. టీడీపీ నుండి చంద్రబాబు ఇద్దరు అభ్యర్థులను మాత్రమే రంగంలోకి దించితే ఎలక్షన్‌తో పని లేకుండా వైసిపి నుండి కూడా విపిఆర్ ఏకగ్రీవంగా ఎన్నిక కావచ్చు. కాని చంద్రబాబు కుయుక్తులు పన్ని 'ఓటు-నోటు' సీన్‌ను రిపీట్ చేస్తే ఎలక్షన్, కొంత టెన్షన్ తప్పదు.

(మిగతా 11వ పేజీలో)



## ఉద్యమం... ఇక ఉధృతం


### హోదా కోసం వాదా

- దూకుడు పెంచిన జగన్
- సహకరిస్తానంటున్న పవన్
- ఎటూ తేల్చుకోలేని నెంబర్ వన్

పార్లమెంటు తలుపులు మూసేసి, టీవీ ప్రసారాలను నిలిపేసి ఆంధ్రప్రదేశ్ విభజన బిల్లును అన్యాయంగా ఆమోదిస్తున్నప్పుడు, నిండు సభలో ఆనాటి స్పీకర్ మీరాకుమార్, అధికార ప్రతిపక్ష నేతలు మన్మోహన్‌సింగ్, సోనియా గాంధీ, అద్వానీ, నరేంద్ర మోడీలు సాక్షులుగా సీమాంధ్రుల గొంతు కోస్తున్నప్పుడు ఆనాటి సభలో సీమాంధ్రకు చెందిన పాతికమంది లోక్‌సభ సభ్యులు దద్దమ్మలుగా చేతగాని వాజమ్మలుగా మిగిలిపోయారు. ఆరోజే పాతికమంది లోక్‌సభ సభ్యులు రాజీనామాలు చేసేసి స్పీకర్ ముఖాన పడేసి వుంటే యూపిఏ ప్రభుత్వం కుప్పకూలేది. సీమాంధ్ర నాయకుల చేతకాని తనానికి, వారి స్వార్ధానికి ఆరోజు విభజన ద్వారా మోసపోయాం. తీవ్ర అన్యాయానికి గురయ్యాం.

ఆనాటి యూపిఏ ఏపిని ఎదురుగా పొడిచింది. మనవాళ్ళు కళ్ళప్పగించి చూస్తూ పొడిపించుకున్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం నాటి యూపిఏ దారుణాలను మరిపిస్తూ ఏపిని వెన్నుపోటు పొడిచింది. పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన విభజన హామీలను తుంగలో తొక్కుతూ ఏపికి ప్రాణప్రదమైన ప్రత్యేక హోదాకు పాతరేసింది. విభజన సమయంలో సీమాంధ్ర ఎంపీలే మన పాలిట విలన్‌లుగా మారితే, రెండేళ్ల క్రితం కేంద్ర ఆర్థికమంత్రి

(మిగతా 11వ పేజీలో)



# కరువుపై కరుణేది?




• కంటి తుడుపుగా 15మండలాల ప్రకటన

2015లో కురిసిన వర్షాలు తప్ప అంతకుముందు మూడేళ్ళుగాని, గత రెండేళ్లలో గాని జిల్లాలో పెద్దగా వర్షాలు పడింది లేదు. ప్రతి ఏటా తీవ్ర వర్షాభావ పరిస్థితులే! శ్రీశైలం నుండి వస్తున్న నీళ్ళతో డెల్టాలో పంటలు పండించుకుంటున్నారు తప్పితే జిల్లాలో కురిసిన వర్షాలను ఆధారంగా చేసుకుని పంటలు పండించడం చాలా తక్కువ. డెల్టాకు కనీసం శ్రీశైలం నుండన్నా నీళ్లొస్తున్నాయి. మెట్ట మండలాలకు ఆ భాగ్యం కూడా లేదు. కేవలం వర్షాలను నమ్ముకునే మెట్టప్రాంతాలలో వాణిజ్య పంటలు వేసుకోవాలి. వర్షాలు పడకపోతే వేసిన పంటలు అంతే సంగతి. గత కొన్నేళ్ళుగా మెట్ట మండలాలలో రైతుల పరిస్థితి దారుణంగా వుంది. ఈ ఏడాది కూడా మెట్ట ప్రాంతాలలో తీవ్ర కరువు ఏర్పడింది. గత ఏడాది చివర్లో వర్షాలు లేవు. దాంతో వాణిజ్య పంటలు వేయలేకపోయారు. కొందరు రైతులు ధైర్యం చేసి వేసినా సరిగా నీళ్ళు లేక పంటలు ఎండిపోయాయి. జిల్లాలో దాదాపు 30 మండలాలలో తీవ్ర కరువు ఏర్పడింది. పశువులకు మేత కూడా లేని పరిస్థితి. రేపు ఏప్రిల్, మే నెలల్లో అయితే త్రాగు నీటికి కూడా అల్లాడాల్సిన దుస్థితి. కేవలం తూర్పు ప్రాంత డెల్టా మండలాలు తప్పించి మిగతా మండలాలలో కరువు నెలకొన్నా ప్రభుత్వం మాత్రం మర్రిపాడు, వింజమూరు, ఉదయగిరి, కొండాపురం, వరికుంటపాడు, సీతారాంపురం, కోట, ఓజిలి, బాలాయపల్లి, సైదాపురం, గూడూరు, పొదలకూరు, రాపూరు, అనంతసాగరం, చేజర్ల మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించింది. జిల్లాలో చాలా తక్కువ మండలాలలో మాత్రమే కరువు ఛాయలు లేవని, దాదాపు జిల్లా అంతటా వర్షాభావ పరిస్థితులున్న దృష్ట్యా జిల్లానే కరువు జిల్లాగా ప్రకటించాలని రైతులు కోరుతున్నారు.

# అవార్డు గ్రహీతలకు రోటరీ సన్మానం




డ్రగ్ ఇన్స్‌పెక్టర్ ప్రశాంతిని సన్మానిస్తున్న డాక్టర్ సి.రోహిణి, మైథిలి

నీతి నిజాయితీలతో సేవలు అందిస్తే ప్రత్యేక గుర్తింపు ఉంటుందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు మునిరాజా, కార్యదర్శి బాల కృష్ణంరాజు తెలిపారు. గూడూరు పట్టణంలోని రోటరీ భవనంలో మంగళవారం రాత్రి రిపబ్లిక్ దినోత్సవంలో అవార్డులు పొందిన పలువురు ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డ్రగ్ఇన్స్‌పెక్టర్ ప్రశాంతి, చిల్లకూరు ఎస్సై శ్రీనివాసరావులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి, డాక్టర్ సి.ఆర్.రెడ్డి, డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ మైథిలి, రోటరీ ప్రతినిధులు జి.సురేంద్రరెడ్డి, కె.మునిగిరీష్, జానకి రామిరెడ్డి, రమణబాబు, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ప్రభారెడ్డి, విష్ణువందన తదితరులు పాల్గొన్నారు.

## మేకపాటి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థికి గోల్డ్‌మెడల్

నెల్లూరుజిల్లా ఉదయగిరి మండల కేంద్రంలోని మేకపాటి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి ఊటుకూరు చంద్రశేఖర్ మెకానికల్ విభాగంలో అనంతపురం జెఎన్‌టియు పరిధిలో గోల్డ్‌మెడల్ సాధించాడు. ఈ నెల21న కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి విద్యార్థిని అభినందించారు.




## మరచిపోలేని అనుభూతి


పక్షుల కేంద్రాన్ని సందర్శించిన సదరన్ రైల్వే జీఎం

నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో విదేశీ విహంగాల సందర్శన మరచిపోలేని అనుభూతినిచ్చిందని సదరన్ రైల్వే జీఎం ఆర్‌కే కులశ్రేస్తా పేర్కొన్నారు. ఈ నెల 18న ఆయన కుటుంబసమేతంగా నెల్లూరు జిల్లా దొరవారిసత్రంలోని నేలపట్టు పక్షుల కేంద్రాన్ని సందర్శించారు. విహంగాల ప్రాధాన్యం, ప్రకృతిలో వాటి పాత్ర తదితర విషయాలను గురించి సెక్షన్ ఆఫీసర్ మణి జీఎంకు వివరించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పక్షుల కేంద్రం పర్యాటకులకు చూడదగిన ప్రాంతంగా అభివర్ణించారు. ఇప్పటికి రెండుసార్లు కేంద్రాన్ని సందర్శించినట్లు తెలిపారు. ఆయన వెంట రైల్వే అధికారులు శ్రీనివాసులు, శ్రీనివాసులరెడ్డి, ఆర్పీఎఫ్ ఎస్సై సిహెచ్ కిరణ్‌కుమార్, రైల్వేసిబ్బంది పాల్గొన్నారు.

## వెంకటగిరి చీరలపై మోజుపడ్డ విదేశీయులు

వెంకటగిరి చేనేత చీరలపై విదేశీయులు మోజుపడ్డారు. దేశీయ పర్యటనలో భాగంగా న్యూజిలాండ్‌కు చెందిన జాన్, డైనీతో సహా 8మందితో కూడిన బృందం ఈ నెల 18న నెల్లూరుజిల్లా వెంకటగిరికి చేరుకుంది. వెంకటగిరి చేనేత వస్త్రాల విశిష్టతను తెలుసుకుని చీరలను కొనుగోలు చేసారు. దేశయాత్రలో భాగంగా తెలుగు రాష్ట్రాల్లో పర్యటిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రాచీన దేవాలయాలను సందర్శించడంతో పాటు చేతివృత్తుల పరిశ్రమలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. వెంకటగిరి చేనేత చీరల విశిష్టతను తెలుసుకుని స్వయంగా పరిశీలించేందుకు వెంకటగిరి వచ్చినట్లు తెలిపారు.

# పెండింగ్ పనులు పూర్తి కావాలి

-------------------- జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు

నీరు–చెట్టు పథకం కింద చేపట్టిన పనులలో పరిపాలన అనుమతులు పొందినవాటిని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు ఆదేశించారు. ఈనెల 21న నెల్లూరు కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లాలో చేపడుతున్న పలు అభివృద్ధి పథకాలలో భాగంగా పెండింగ్ ప్రాజెక్టులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్నా బ్యారేజీ నిర్మాణంలో నిర్వాసితులైన 49మంది లబ్దిదారులకు పట్టాల జారీ చేసే విషయంలో వేగవంతంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. తెలుగుగంగ ప్రాజెక్టుకు సంబంధించి అటవీ అనుమతుల విషయమై సంయుక్త సర్వే అనంతరం తీసుకోవలసిన చర్యలపై సమీక్షించారు. అదేవిధంగా సోమశిల లింకు కెనాల్ విషయంలో పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పనులు పూర్తయిన వాటికి సంబంధించి బిల్లుల పేమెంట్ విషయంలో త్వరితగతిన చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఏర్పాటు చేయనున్న 45నూతన సబ్‌స్టేషన్ల విషయంపై స్థలాల సేకరణ విషయంలో విద్యుత్‌శాఖ, రెవెన్యూ శాఖ సంయుక్తంగా కృషి చేయాలన్నారు. ఇతర జిల్లాల్లో నీటి సరఫరా విషయంలో తీసుకుంటున్న చర్యలను సమీక్షించి మన జిల్లాలో కూడా అవసరమైన చోట నీటి రవాణాకై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన కోరారు. అనంతరం పర్యాటక శాఖ తరపున చేపడుతున్న పలు పనులను ఆయన సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎ.ఎం.డి ఇంతియాజ్, సంయుక్త కలెక్టర్–2 వెంకటసుబ్బారెడ్డి, డిఆర్ఓ వెంకటసుబ్బయ్య, రెవెన్యూ డివిజనల్ అధికారులు బాపిరెడ్డి, భక్తవత్సలరెడ్డి, శీనునాయక్, హరిత, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి ప్రశాంతి, పౌరసరఫరాల ఇన్‌ఛార్జి అధికారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## పేదలగుండెల్లో...

# గుభాళించిన నేదురు'మల్లి'

**83వ జయంతి సందర్భంగా పెద్దాయనను తలుచుకున్న అభిమానులు**



రక్తదానం చేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

పేదలు, దళిత వర్గాల అభ్యున్నతిని కాంక్షిస్తూ, వారి అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించిన నాయకుడు మాజీముఖ్యమంత్రి స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి. నెల్లూరుజిల్లా చరిత్రలో నిలిచిన నాయకుడు. రాష్ట్ర రాజకీయాలపై చెరగని ముద్ర వేసుకున్న రాజకీయ యోధుడు. జననం నుండి మరణం దాకా కాంగ్రెస్ వాదిగానే నడిచిన ప్రజాసైనికుడు. ఈ నెల 20న ఆయన 83వ జయంతిని పురస్కరించుకుని కోట మండలం విద్యానగర్‌లోని నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్ నందు నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఫౌండేషన్ ఛైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తన తండ్రి స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, దళిత, బడుగు వర్గాలకు మంచి చేయాలన్న తన తండ్రి ఆశయ సాధనకు కృషి చేస్తానని చెప్పారు. ప్రతి ఏటా తన తండ్రి జయంతి రోజున రక్తదానంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. నేదురుమల్లి అభిమానులు, ఎన్‌బికెఆర్ విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు మొత్తం 538 మంది రక్తదానం చేయగా, రెడ్‌క్రాస్ వాళ్ళు 284 యూనిట్లు, గూడూరు ఏరియా ఆసుపత్రి వారు 147 యూనిట్లు, నెల్లూరు పెద్దాసుపత్రి వాళ్ళు 107 యూనిట్లు సేకరించారు.

ఈ కార్యక్రమంలో ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్ కుమార్‌రెడ్డి, సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణమోహన్, మేనేజర్ కె.రామకృష్ణారెడ్డి, రెడ్‌క్రాస్ కన్వీనర్ డాక్టర్ ఏ.వి.సుబ్రహ్మణ్యం, డాక్టర్ కె.సింధూజ, డాక్టర్ జి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



# ముక్కంటికి విపిఆర్ స్వర్ణవాహన సేవ

- శ్రీకాళహస్తీశ్వరునికి 8 బంగారు వాహనాలు
- నేత్రపర్వంగా వాయులింగేశ్వరునికి వాహనసేవలు
- వెల్లివిరిసిన స్వర్ణకాంతులు



శివయ్య సేవలో పాల్గొన్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి - ప్రశాంతి దంపతులు

దక్షిణకాశిగా ప్రసిద్ది చెందిన ప్రఖ్యాత పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తీశ్వరాలయం. ఇటీవలే ఇక్కడ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఎంతో వైభవంగా జరిగాయి. ఈ ఏడాది ప్రత్యేకత ఏమిటంటే స్వామివారికి బంగారు శివరాత్రి అన్నట్లుగా స్వర్ణకాంతుల శోభతో ఆలయం విరాజిల్లింది. నెల్లూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆధ్యాత్మిక చింతన కలిగిన ప్రముఖ దాత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి కుటుంబం సుమారు ఒకటిన్నర కోటి రూపాయలు వెచ్చించి శ్రీకాళహస్తీశ్వరాలయంలో శివరాత్రికి నిర్వహించే ఎంతో విశిష్టమైన సేవల్లో స్వామివారు–అమ్మవార్ల ఉత్సవాలకు ఉపయోగించే వాహనాలను బంగారు తాపడం చేయించారు. శివరాత్రి వేడుకల్లో ఒక్కోరోజు ఒక్కొక్క వాహనంపై స్వామివార్ల వాహనోత్సవాలు ఎంతో వైభవంగా జరగడం ఆనవాయితీ. ఈసారి మాత్రం వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి కుటుంబం ఆ పరమేశ్వరుని ఉత్సవాలకు అవసరమైన నంది, సింహం, అశ్వ, హంస, యాళీ, నెమలి, శేష, గజ వాహనం..మొత్తం 8 వాహనాలకు స్వర్ణకాంతులతో శోభిల్లేలా బంగారు తాపడం చేయించడం విశేషం. శ్రీకాళహస్తీశ్వరాలయ ఇ.ఓ డి.భ్రమరాంబకు ఈ వాహనాలను అందజేయగా వాటికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. గత ఏడాది కుంభాభిషేకం జరుపుకున్న రాజగోపురం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వాహనాల మండపంలో ఆ వాహనాలకు పూజలు చేసి, హోమాలు నిర్వహించారు. గత ఏడాది మహాకుంభాభిషేకానికి భిక్షాల గాలిగోపురంపై ఉన్న కలశాలకు బంగారు తాపడం చేయించిన వేమిరెడ్డిని, ఇటీవల ఆలయ ఇ.ఓ భ్రమరాంబ కలసి ఈసారి మహాశివరాత్రి ఉత్సవాలకు స్వామివారి ఒక వాహనాన్ని బంగారు తాపడం చేయించాలని కోరగా, అందుకు సమ్మతించిన వేమిరెడ్డి, ఏకంగా మొత్తం 8 వాహనాలకు కూడా బంగారు తాపడం చేయించి ఆలయానికి అందజేయడం వేమిరెడ్డి శివభక్తికి, దాతృత్వానికి నిదర్శనం. సాక్షాత్తూ పరమశివుడే ఇంతటి బృహత్కార్యాన్ని తనకు అనుగ్రహించినట్లుగానే భావించి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి నిండుభక్తితో ఈ దైవకార్యం నిర్వర్తించడం పట్ల భక్తుల్లోనూ, ఆలయవర్గాల్లోనూ ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో దాత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ, ఇదంతా ఆ పరమేశ్వరుని దయేనని, అమ్మవారైన జ్ఞానప్రసూనాంబ కరుణాకటాక్షమేనన్నారు. ఆ స్వామివార్ల ఆశీస్సులుంటే ఆలయానికి సంబంధించి ఎన్ని అభివృద్ధి కార్యక్రమాల్లోనైనా భాగస్వాములమవుతామన్నారు. పంచభూత లింగాల్లో విశిష్టమైన వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన ఈ దివ్యక్షేత్రం తన సొంతజిల్లా అయిన నెల్లూరుజిల్లా పక్కనే ఉండడం తాము చేసుకున్న అదృష్టమన్నారు. శ్రీకాళహస్తీశ్వరుని ఆలయాన్ని ఆధునీకరించుకోవాల్సి ఉందన్నారు. మనం ఆ దైవానికి, దేవాలయాలకు చేసే సేవ ఏదైనా ఉంటే..అది గుప్తంగా ఉండాలే కానీ, మన దాతృత్వాలను బహిర్గతం చేసుకోవడం సముచితం కాదన్నది తన అభిప్రాయమన్నారు. ఆ పరమశివుని సేవకు తమకు అవకాశం కల్పించినందుకు ఆలయ ఇ.ఓ భ్రమరాంబకు ఈ సందర్భంగా వేమిరెడ్డి తన ధన్యవాదాలు తెలిపారు.

**విమాన గోపురాన్ని స్వర్ణమయం చేయండి - ఇ.ఓ భ్రమరాంబ**

శ్రీకాళహస్తీశ్వరాలయ ఇ.ఓ డి. భ్రమరాంబ మాట్లాడుతూ, వేమిరెడ్డి దాతృత్వానికి ధన్యవాదాలన్నారు. స్వామివారి విమాన గోపురాన్ని స్వర్ణమయం చేయాలన్నది తమ లక్ష్యమని, అందుకు దాత వేమిరెడ్డి సహకరించాలని కోరారు. ఉత్సవ విగ్రహాలకు కూడా బంగారు తాపడం చేయిస్తే బావుంటుందని అంటూ, ఏదేమైనా శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదన్నారు. అనంతరం, దాతల కుటుంబసభ్యులు, బంధువులు బాలకృష్ణారెడ్డి, అశోక్‌రెడ్డి దంపతులకు వేదపండితులు ఆశీర్వచనం చేసి, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం నాలుగు మాడా వీధుల్లో జరిగిన స్వామివార్ల ఉత్సవ వేడుకలో దాతల కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇ.ఇ వెంకటనారాయణ, ఏఇఇ మురళీధర్, ఆలయ సిబ్బంది లోకేష్‌రెడ్డి, దామోదరం, ఆలయ ప్రధాన అర్చకులు స్వామినాధన్ గురుకుల్, ఉపప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్, పిఆర్ఓ నాగయ్య పాల్గొన్నారు.

# దళారులల చేతుల్లో దగా పడొద్దు

- రైతులకు డిసిసిబి ఛైర్మన్ మెట్టుకూరు సూచన



రైతులు దళారులను నమ్మి తక్కువ ధరకు తమ పంటలను అమ్ముకోవాల్సిన అవసరం లేదని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీన మనుబోలులో ప్రాథమిక సహకార బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్న లక్ష్యంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సొసైటీ ద్వారా జిల్లా వ్యాప్తంగా 90 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సొసైటీల ద్వారా ధాన్యం అమ్మకాలు జరిగితే రైతులకు గిట్టుబాటు ధర భరోసాతో పాటు, సొసైటీ కూడా ఆర్థికంగా బలపడుతుందన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి సమస్యలు రాకుండా వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్‌ఛైర్మన్ నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు సి. హెచ్.వెంకటశేషారెడ్డి, బుర్రా వెంకటేశ్వర్లు, బ్యాంకు సిఇఓ సరిత, సొసైటీ సిఇఓ చెంచుమబులు, వ్యవసాయాధికారి శేషగిరి పాల్గొన్నారు.

## 'ప్రభా'తం

# అమ్మ భాషే..శ్వాస!

**ఒక జాతి విశిష్ట సంస్కృతి, వారసత్వం అన్నీ ఆ జాతి మాట్లాడే మాతృభాష లోనే నిబిడీకృతమై ఉంటాయి. తల్లి లేనిదే దేహం లేదు..అదేవిధంగా భాష లేనిదే జాతికి జీవం ఉండదు. భాష..అన్నది ఒక జీవనాదం. అమ్మ పలుకులే భాషకు తొలి పలుకులు. తేనెలొలికే అమ్మపదాలను ఏనాటికీ ఎవరూ విస్మరించకూడదు. తెలుగు పలుకే మన ఉనికి.. అన్నది గుర్తుంచుకుని అందరం కలసి మనభాషను మనం పరిరక్షించుకోవాలి. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు తెలుగు భాష అభ్యున్నతికి మరింతగా చేయందించాలి.**

ఏ సమాజానికైనా అమ్మ భాషే.. శ్వాస. అదే ఉచ్ఛ్వాస..నిశ్వాస కూడా. మాతృభాష.. మన సంస్కృతికి దర్పణం. అది మన వారసత్వ సంపద. భావి తరాలవారికి మన వారసత్వ సంపదను తెలియజేసేందుకు ఉపయోగపడేది మాతృభాషే. ఒక జాతి విశిష్ట సంస్కృతి, వారసత్వం అన్నీ ఆ జాతి మాట్లాడే మాతృభాష లోనే నిబిడీకృతమై ఉంటాయి. తల్లి లేనిదే దేహం లేదు.. అదేవిధంగా భాష లేనిదే జాతికి జీవం ఉండదు. భాష..అన్నది ఒక జీవనాదం. తల్లి నుంచి సంక్రమించే ఈ జీవనాదమే సమాజానికి జీవనాడి. అమ్మ పలుకులే భాషకు తొలిపలుకులు. తేనెలొలికే అమ్మపదాలను ఏనాటికీ ఎవరూ విస్మరించకూడదు. అమ్మభాషకు.. అందులోనూ మన తెలుగుభాషకు ఎనలేని వారసత్వ సంపద ఉంది. మహోన్నతమైన సారస్వత సంపద మనకుంది. అది తెలుగువారి సొత్తు. ఎంతోమంది మహనీయులు తెలుగుభాష అభ్యున్నతికి ఎనలేని కృషిచేశారు. ఎందరో మహాకవులు, ఎందరో మహానుభావులు తెలుగు సారస్వత ఖ్యాతిని దశదిశలా చాటేవిధంగా అత్యద్భుతమైన రచనలెన్నో చేసి అందరికీ మార్గదర్శకమయ్యారు. వారి కృషి ఏనాటికైనా శ్లాఘనీయమైనదే.

మాతృమూర్తి, మాతృభూమి, మాతృదేశం, మాతృభాష.. ఇవన్నీ ప్రతిఒక్కరిలో అత్యంత ఆత్మీయతను, ప్రేమను.. గౌరవాన్ని కలిగిస్తాయి. మనిషిలో మమతల్ని.. మానవీయతను మేల్కొల్పి జాతిని జాగృతం చేసి.. అందరినీ ఆత్మీయతానందాల్లో పరవశింపజేసేదే భాష.. మాతృభాష. సమాజాభ్యున్నతికి శ్రీకారం చుట్టేది.. ప్రగతిపథంలో మనల్ని నడిపించేదీ.. అభివృద్ధికి నిచ్చెన వేసేదీ భాషే. అందుకే అది ఎంతో పవిత్రమైనది.. అమృతతుల్యమైనది. తల్లి గర్భంలో ఉన్నప్పుడు బిడ్డకు మాతృభాషతో పరిచయం కలుగుతుంది. ఉగ్గుపాలతోనే బిడ్డకు అమ్మ భాషను నేర్పుతుంది.. అదే అమ్మవుతుంది.. అమృతమవుతుంది. ముద్దుమాటలొలికే ఆ అమ్మభాష మనకు..మన చుట్టూ ఉన్న సమాజానికీ జవజీవాలనిచ్చే జీవభాష అవుతుంది. ఆ భాషే.. ఆ తర్వాత కూడా అమ్మలా మన చేయిపట్టుకుని సమాజంలో మనల్ని మునుముందుకు నడిపిస్తుంది. సగర్వంగా జీవించేలా చేస్తుంది.

అందుకే మాతృభాషకు వందనం!.. మాతృమూర్తికి వందనం!...

ఒకవేళ మాతృభాషను చదవడం, రాయడం రాకపోయినా, అమ్మభాషను గ్రహించి పలకడం వల్ల ఆ భాష సునాయాసంగా వంటబడుతుంది. అమ్మభాషే వచ్చాక ఎంతటి కష్టమైన భాషలనైనా.. ఎన్ని భాషలనైనా నేర్చుకునేందుకు అదే సాధనమవుతుంది కూడా. ఇలా.. మనందరి మనుగడకు మన భాషే ఆధారమవుతుంది. అందుకే, ఆజన్మాంతం మనం భాషకు రుణపడి ఉండాలి. మన భాషను ఎల్లవేళలా మనం కాపాడుకోవాలి. అది ఏనాటికీ వసివాడని కుసుమంలా, పరిమళభరితంగా విరాజిల్లాలి. అందుకే అమ్మభాషను ప్రతిఒక్కరూ ప్రేమించాలి.. మాతృభాషను పరిరక్షించుకోవాలి. అది మన ధర్మం. ప్రపంచవ్యాప్తంగా పలు భాషలు కాలక్రమంలో వాడుక కోల్పోయి క్రమేణా మృతభాషగా మారిపోతున్నాయని యునెస్కో హెచ్చరిస్తున్న నేపథ్యాన్ని కూడా ఈ సందర్భంగా దృష్టిలో ఉంచుకోవాలి. యునెస్కో ప్రమాణాల ప్రకారం, ఏ భాష వాడకంలో రెండు తరాలపాటు క్రమంగా 20శాతం వంతున తగ్గిపోతూ వస్తుందో ఆ భాష ఉనికికి రెండు దశాబ్దాల్లో ప్రమాదం ముంచుకొస్తుందనేది ఒక హెచ్చరిక. అయితే, తెలుగుభాషకు అంతటి దుస్థితిని మనం ఊహించలేం కానీ, తెలుగు పలుకే మన ఉనికి... అన్నది మాత్రం ఏనాటికీ విస్మరించకుండా మన భాష అభ్యున్నతికి మనం చిత్తశుద్ధితో పాటుపడాలన్నది మాత్రం స్పష్టం. అందుకే, మనకే కాక.. మన పిల్లలకు అందరికీ మాతృభాష పట్ల మమకారం పెంపొందేలా మనవంతు కృషి ఎల్లవేళలా కొనసాగుతూనే ఉండాలన్నది ఎవరూ మరచిపోకూడదు. మన మాతృభాష.. ఏనాటికైనా సరే.. అమృత భాషగానే ఉండాలే తప్ప..ఏనాటికీ మృతభాష కాకూడదు..కారాదు. అందుకు, అందరూ అమ్మభాషలోనే మాట్లాడుకోవాలి. చదువుకోవాలి..పాఠశాలల్లో విద్యాబోధన, ప్రభుత్వ పాలన అంతా తెలుగులోనే జరగాలి. అయితే తెలుగును ప్రేమించడమంటే ఇతర భాషలను వ్యతిరేకించడం కాదు.. .ఆయా భాషలను నేర్చుకున్నప్పటికీ, మాతృభాష అయిన తెలుగును మాత్రం ఎవరూ ఏనాటికీ విస్మరించకుండా తమ వంతు భాషా పరిరక్షణకు కృషి చేయడమే ముఖ్యం. అందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మరింతగా చేయూతను అందించాల్సివుంది. ప్రధానంగా తెలుగుభాషను వ్యావహారిక భాషగా, పరిపాలనా భాషగా బాగాప్రాధాన్యత ఇచ్చి భాషాభివృద్ధికి బాటలు వేయాల్సి ఉంది. పాఠశాలల్లో, విద్యాలయాల్లో తెలుగు భాషను బోధనాభాషగా అమలుచేయాలి. తెలుగు మాధ్యమంలో విద్యాబోధన సజావుగా సాగేలా చూడాలి. మన ఆచార వ్యవహారాలు, మన సంప్రదాయాలు, మన సంస్కృతి.. మన గొప్పదనం అన్నీ భాషతోనే ముడిపడివున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే మాతృభాష.. మన వారసత్వ సంపద. ఎంతో ప్రాచీనకాలం నుంచి వస్తున్న ఈ వారసత్వ సంప్రదాయాలను గానీ, మన భాషను గానీ విస్మరించకుండా కాపాడుకుంటూనే ఉండాలి. ముఖ్యంగా, తెలుగును మన అమ్మభాషగా.. అదే మన ధ్యాసగా.. శ్వాసగా మన గుండెల్లో నిలుపుకోవాలి. తెలుగుభాష పరిరక్షణకు ఎల్లవేళలా కృషి చేస్తూనే ఉండాలి. గ్రామస్థాయిల్లో ఉన్న యాసను, భాషను పొదివి పట్టుకుని, భాషాభ్యున్నతికి పండితులు, పరిశోధకులు మరింతగా కృషి చేసి తెలుగు వెలుగులను ఎల్లెడలా తేజరిల్లేలా చేయాలి. కవులు, రచయితలు, కవిపండితులు ప్రపంచమే గర్వించేవిధంగా అత్యద్భుతమైన రచనలు చేస్తూ, తెలుగు సాహితీ వైభవాన్ని దశదిశలా చాటాలి.. తెలుగుభాషకు ఉన్న వైశిష్ట్యాన్ని, ఔన్నత్యాన్ని జగద్విదితం చేయాలి. తెలుగుభాషను శిఖరాయమానం చేస్తూ..తెలుగు భాష గొప్పదనాన్ని నేటితరానికే కాక.. మన భావితరాలకు కూడా అందిస్తుండాలి. తెలుగు వెలుగులను సదా ప్రకాశమానం చేస్తూనే ఉండాలి. అందుకు, ఈ శుభదినాన..ప్రపంచ మాతృభాషా దినోత్సవం (ఫిబ్రవరి 21) రోజున అందరం.. మనందరం చిత్తశుద్ధితో ప్రతినబూనుదాం!....తెలుగుతల్లికీ జై!..తెలుగుభాషకూ జై!...

# హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలి

## స్వర్ణహంపీ మఠం పీఠాధిపతి శ్రీ గోవిందానంద సరస్వతి స్వామీజీ

భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ఎంతో గొప్పవని, సనాతనమైన హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలని, ఈ బాధ్యత ప్రతి హిందువుపై ఉందని స్వర్ణహంపీ మఠం వేదవ్యాస ఆశ్రమానికి చెందిన శ్రీ గోవిందానంద సరస్వతి స్వామీజీ అన్నారు. ఈ నెల 18న నెల్లూరు రామ్మూర్తినగర్‌లోని బాలపీరయ్య కల్యాణ మండపంలో బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ, మన ధర్మాన్ని మనం కాపాడుకోవాలని, తద్వారా సమాజాభ్యున్నతికి తోడ్పడాలన్నారు. ఏపి బ్రాహ్మణ సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జె.శ్రీకాంత్ మాట్లాడుతూ బ్రాహ్మణులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ సందర్భంగా నగరంలో భారీర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వారణాశి నాగార్జున, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడూరు సతీష్‌శర్మ, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు దీప్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య నూతన కార్యవర్గసభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది.



గోవిందానంద సరస్వతి స్వామీజీకి స్వాగతం పలుకుతున్న రంగనాథస్వామి దేవస్థాన అర్చకులు

**శ్రీ రంగనాథుని సేవలో :** స్వర్ణహంపి పీఠాధిపతి శ్రీ గోవిందానందసరస్వతి స్వామీజీ 18వ తేదిన రంగనాయకులపేటలోని శ్రీ రంగనాథస్వామి ఆలయానికి వెళ్లి రంగనాథస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులతో పాటు, ధర్మకర్తల మండలి ఛైర్మెన్ మంచికంటి సుధాకరరావు, ఇ.ఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి, ధర్మకర్తలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. స్వామీజీ రంగనాథస్వామివారికి, అమ్మవారికి, శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత, దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆల యాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు తంగిరాల రాధాకృష్ణశర్మ స్వామీజీకి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రత్నం జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

# ధ్యానంతో.. సంపూర్ణ ఆరోగ్యం

ధ్యానం చేయడం ద్వారా మంచి ఆరోగ్యం పొందవచ్చుని, మానసిక ప్రశాంతత చేకూరి వత్తిడిని అధిగమించవచ్చని వాసుదేవ గోశాల నిర్వాహకులు వాసుదేవన్ తెలిపారు. ఈ నెల 18న నెల్లూరు బాలాజీనగర్‌లోని సాయిబాబా అద్దాల మందిరంలో మహర్షి భావాతీత యోగా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ధ్యాన, యోగ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ధ్యానం చేయడం ద్వారా నాడీ శుద్ధి జరిగి వత్తిడి దూరమవుతుందన్నారు. ఈ సందర్భంగా స్వాప్స్ సంస్థ వేసవికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. మహర్షి భావాతీత ధ్యాన, యోగ కేంద్ర నిర్వాహకులు రవీంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భగవద్గీత ఉపన్యాసకులు నజీర్‌బాషా, ఆచార్య ఆదిత్య, జనార్ధన్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.




# కేసీఆర్‌ను ఆదర్శంగా తీసుకోండి

తెలంగాణ సాధన కోసం కేసీఆర్ ఎలాంటి పోరాటం చేసాడో చూసాం. తుదికంటా ఉద్యమాన్ని నడిపించాడు. తెలంగాణ వచ్చేదాకా కూడా ఉద్యమమే చేసాడు. తెలంగాణ వచ్చాక రాజకీయాలు చేస్తున్నాడు. మన ఏపి నాయకులు కేసీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి. రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధించేంత వరకు కూడా రాజకీయాలను పక్కనపెట్టాలి. ప్రత్యేకహోదా కోసం ప్రణాళికా బద్ధంగా ఉద్యమం నడపాలి. అన్ని రాజకీయ పార్టీల నేతలు కూడా ఏకతాటిపైకి రావాలి. ఏపికి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరూ రాజీనామాలు చేయాలి. కేంద్రప్రభుత్వ వ్యవస్థలను స్థంభింపజేయాలి. రాష్ట్రం ఒక్కటై మొండిగా పోరాడితేగాని ప్రత్యేకహోదా విషయంలో కేంద్రం దిగిరాదు.

**లెక్కల సతీష్‌రెడ్డి, కలిగిరి.**

# రోడ్డు కబ్జా

విడవలూరు బస్టాండ్‌లో ఎన్టీఆర్ రోడ్డు కూడలిలో ఓ ప్రైవేట్ ఆసుపత్రి వారు రోడ్డు స్థలాన్ని కబ్జా చేశారు. ఇక్కడ వాహనాలు పోవాలన్నా, మలుపు తిరగాలన్నా చాలా ఇబ్బందిగా వుంటుంది. ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. జిల్లా కలెక్టర్, ఎస్పీలు వెంటనే చొరవ తీసుకుని ఈ ఆక్రమణలను తొలగించాలని మనవి.

**– పి.వెంకయ్య, విడవలూరు.**

# హౌసింగ్‌లో అవినీతి

'హౌస్ ఫర్ ఆల్' స్కీం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతోంది. నెల్లూరులో వెంకటేశ్వరపురం యాప్‌పాండ్ వద్ద నిర్మించిన అపార్ట్‌మెంట్లలో చదరపు అడుగు 2200 రూపాయలంట! ఆదిత్యనగర్, మాగుంట లే అవుట్ ప్రాంతాలలోనే ఈ రేట్లకు అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లు దొరుకుతున్నాయి. ఈ ఏరియాలో స్థలం ఖరీదు కూడా ఎక్కువ. వెంకటేశ్వరపురం వద్ద ఇళ్ళు నిర్మించింది ప్రభుత్వ స్థలంలో, వాటికి ఇసుక కూడా ఫ్రీ, మరి ఇంత రేటేంటి? ఒక పక్క తెలంగాణలో ఇదే ఇళ్ళను అడుగు 1200 రూపాయలు లెక్కన ఇస్తుంటే ఇక్కడ వెయ్యి రూపాయలు అదనమేంటి? ఇది అవినీతి కాదా?

**– చట్టం మహేష్, నెల్లూరు.**

## ఉదయగిరిలో...

# పాత పోరా? కొత్త నీరా?





***జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాలలో 9అసెంబ్లీలది ఒక దారి అయితే ఉదయగిరి అసెంబ్లీది మాత్రం ఇంకో దారి! మెట్టప్రాంతమైనప్పటికి ఇక్కడి ప్రజలు రాజకీయ చైతన్యవంతులు. పార్టీ ప్రభంజనాలు, నాయకుల పట్ల సానుభూతి వంటి వాటికంటే కూడా ఇక్కడ పోటీ చేసే అభ్యర్థుల వ్యక్తిగత సామర్థ్యం, గుణగణాలను బట్టే ప్రజలు తీర్పునిస్తారు.***

1978లో అంతటి ఇందిరాగాంధీ ప్రభంజనంలో కూడా ఈ జిల్లాలో ఉదయగిరిలో మాత్రం కాంగ్రెస్ ఓడిపోయింది. జనసంఘ్ అభ్యర్థిగా వెంకయ్య నాయుడు గెలిచాడప్పుడు. 1983లో ఎన్టీఆర్ ప్రభంజనం ఉధృతంగా పని చేసింది. జిల్లాలో 10అసెంబ్లీ సీట్లలో తెలుగుదేశం విజయఢంకా మోగించింది. కాని ఉదయగిరిలో మాత్రం ఓడిపోయింది. బీజేపీ అభ్యర్థిగా వెంకయ్య నాయుడు విజయం సాధించారు. కేవలం అభ్యర్థి వ్యక్తిగత విజయాలే ఇవి.

రాజకీయాలను డబ్బు శాసిస్తున్న నేటి కాలంలో కూడా ఉదయగిరి ప్రజలు మాత్రం ముందు అభ్యర్థి వ్యక్తిగత వ్యవహారశైలికే ప్రాధాన్యతనిస్తుంటారు. ఇక్కడనుండి ఎమ్మెల్యేగా గెలిచినవాళ్ళు తమ ఇళ్లలో పెళ్లిళ్లకు, కర్మంత్రాలకు రావాలని, తాము కనిపిస్తే పేరుపెట్టి ఆప్యాయంగా పిలవాలని కోరుకుంటారు. ఇక్కడ సామాన్య ప్రజలు ఎమ్మెల్యేల నుండి అంతకుమించి ఆశించేదేమీ వుండదు. గతంలో ఇక్కడ ఎమ్మెల్యేలుగా పనిచేసిన వెంకయ్యనాయుడు, కంభం విజయరామిరెడ్డి, స్వర్గీయ మాదాల జానకిరామ్‌లు అటువంటి ట్రెండ్‌నే ఫాలో అయ్యారు.

అలా మెయింటెన్ చేయడంలో మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి కొంత వరకు పర్వాలేదు. 2014 ఎన్నికలలో ఆర్థికంగా కొన్ని లోటుపాట్లు వల్ల ఓడిపోయాడు. ఎంపి అభ్యర్థి, ప్లస్ ఆయన అన్న అయిన మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఏ మాత్రం సహకరించున్నా గెలిచేసుండేవాడు.

ఇక ప్రస్తుత ఎమ్మెల్యే బొల్లినేని రామారావు అయితే గత ఎమ్మెల్యేల నైజానికి పూర్తిగా విరుద్ధం. అతను కాంట్రాక్టర్. అదికూడా మహారాష్ట్రలో ఉంటాడు. వారానికి ఒకట్రెండు రోజులు మాత్రమే నియోజకవర్గానికి రాగలుగుతున్నాడు. మండలస్థాయి నాయకులతో కలవడానికే ఆయనకు టైం సరిపోవడం లేదు. చిన్నస్థాయి వ్యక్తులను కలవడానికి ఆయన ఇష్టపడడని కూడా అంటారు. ఇక జనాలనేం కలుస్తాడు... వారిళ్ళలో కార్యా లకు ఏం వెళతాడు? జనాల్లో ఉండడం లేదనేదే ఆయనపై వ్యతిరేకత!

ఈసారి ఆయనకు సీటిస్తే ఉదయగిరిలో గెలవడనే ప్రచారం నియోజకవర్గంలో విస్తృతంగా వుంది. మరి ఆయనకు ప్రత్యామ్నాయ అభ్యర్థి ఎవరనే దానిపై చర్చ జరుగుతోంది. ఈ పరంపరలో మాజీఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, పారిశ్రామికవేత్త కావేరి కృష్ణారెడ్డిల పేర్లు వినిపిస్తున్నాయి. అలాగే వైసిపి నుండి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డే మేలని కొందరు, ఆయన కంటే గౌతమ్ అయితే బెటర్ అని మరికొందరు అంటున్నారు. మొత్తానికి పాత అభ్యర్థులు ఇద్దరూ మారితేనే బాగుంటుందనే కొత్తపాట నియోజకవర్గంలో ఇక్కడా అక్కడా వినిపిస్తూ వుంది!

# శ్రీసిటీలో 'ఏక్ భారత్' బృందం



శ్రీసిటీ డెవలప్‌మెంట్ కమిషనర్ కార్యాలయాధికారులతో జమ్మూ కాశ్మీర్ బృందం

జమ్మూ కాశ్మీర్ కు చెందిన 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' ప్రతినిధుల బృందం ఈ నెల 19వ తేదీ శ్రీసిటీని సందర్శించింది. ఏడుగురు సభ్యులు గల ఈ బృందానికి శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ రమేష్‌కుమార్ సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ గురించి వివరించారు. అసిస్టెంట్ డెవలప్‌మెంట్ కమీషనర్ ఎ.యస్.పి శర్మ, కస్టమ్స్ స్పెసిఫైడ్ ఆఫీసర్ విజయభాస్కర్‌తో సమావేశమై శ్రీసిటీ సెజ్ సాధిస్తున్న ప్రగతి గురించి వారు తెలుసుకున్నారు.

అనంతరం, వారు శ్రీసిటీలోని వివిధ ప్రదేశాలలో పర్యటించి అక్కడి మౌళిక వసతులను, జరుగుతున్న పారిశ్రామిక ప్రగతిని ప్రత్యక్షంగా వీక్షించారు. డేనియలి మరియు యెన్.హెచ్.కే స్ప్రింగ్స్ పరిశ్రమలకు వెళ్లి అక్కడ ఉత్పత్తులను పరిశీలించారు. దేశంలోని భిన్న సంస్కృతీ సాంప్రదాయాలను, జరుగుతున్న అభివృద్ధిని తెలుసుకోవడానికిగాను, వివిధ ప్రాంతాలకు చెందిన యువకులను బృందాలుగా ఏర్పరచి, ఎన్నిక చేసిన రాష్ట్రాలకు, కేంద్ర ప్రభుత్వం పంపుతుంది. ఆ పర్యటనలోభాగంగా జమ్మూ కాశ్మీర్‌కు చెందిన ఈ బృందం శ్రీసిటీకి విచ్చేసింది.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు





నిర్యాణం : 1995, మార్చి 1వ తేదీ
స్వర్గీయ శ్రీమతి రుక్మిణమ్మ
(స్వర్గీయ తిక్కవరపు బాబురెడ్డి గారి ధర్మపత్ని)

మాతృదేవోభవ

మా మాతృమూర్తి దైవసన్నిధికి చేరి
23 ఏళ్ళు నిండనున్న సందర్భంగా
ఆమె ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...
ఆమె ఆత్మీయులైన వారందరికీ
మా మాతృదేవత ఆశీస్సులు కోరుకుంటూ...

డా॥ టి.సుబ్బరామిరెడ్డి
రాజ్యసభ సభ్యులు
మరియు
వారి కుటుంబసభ్యులు

# వాకర్స్ సేవలు అభినందనీయం

## - రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి ప్రశంస



వాకర్స్ రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ వారు అందిస్తున్న సామాజిక సేవలు ఎంతో అభినందనీయమని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రశంసించారు. ఈ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18న రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన వాకర్స్‌ను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఏపిఐఐసి ఛైర్మెన్ కృష్ణయ్యకు వాకర్స్‌తో కలిసి ఆయన పుష్ప గుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కిలారి తిరుపతినాయుడు, జి.వేణుగోపాల్, సత్యం, బ్లడ్‌క్యాంప్ కో-ఆర్డినేటర్ రాఘవేంద్రశెట్టి, నలుబోలు బలరామయ్య నాయుడు, వేలూరు రంగారావు, అమరేంద్రరెడ్డి, స్వర్ణ రమేష్‌బాబు, బాసం శేషగిరిరావు, టి.బాలసుధాకర్, సుబ్బరామిరెడ్డి, సుబ్బరాజు, ఎన్ఎల్‌వి ప్రసాద్, శ్రీనివాసకుమార్, శ్రీనివాసులురెడ్డి, టి.శేఖర్, ఓబులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీరావు ఐ.ఏ.యస్‌కి ఘన సత్కారం



ఢిల్లీరావును సన్మానిస్తున్న సంస్కృతి సమాఖ్య సభ్యులు

ఐఏఎస్‌గా పదోన్నతి పొందిన 'నుడా' వైస్‌ఛైర్మన్ ఢిల్లీరావుకు నగరంలోని సంస్కృతి సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 18న ఘనసన్మానం జరిగింది. దర్గామిట్టలోని అచ్యుత సుబ్రహ్మణ్యం కల్యాణమండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిఎస్‌యు ఉపకులపతి ఆచార్య డా.వీరయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులను సత్కరించారు. సంస్కృతి సమాఖ్య వ్యవస్థాపకుడు రామ్‌జీ ఆధ్వర్యంలో ఢిల్లీరావును ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. సంస్కృతి సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ బాగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డిఎస్పీ మురళీకృష్ణ, జయప్రకాష్, అచ్యుత సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరుకు పెళ్లి కళ

మూఢం పోయింది. దాదాపు మూడు నెలల తర్వాత నెల్లూరులో పెళ్ళి భాజాలు వినిపించబోతున్నాయి. ఈ నెల 24వ తేదీ నుండి మస్తుగా పెళ్ళిళ్ళున్నాయి. నెల్లూరులోని అన్ని కళ్యాణ మండపాలు వివాహ, రిసెప్షన్ వేడుకలకు బుక్ అయ్యాయి. కళ్యాణ మండపాలు దొరకక కొందరు దేవాలయాలు లేదా తమ ఇళ్ళ వద్ద పెళ్ళిళ్ళ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. భారీగా వివాహాలుండడంతో నెల్లూరులోని అన్ని హోటళ్ళలో గదులు, గెస్ట్‌హౌస్‌లు ఫుల్ అయిపోయాయి.

# ఆక్రమణలతో తలనొప్పి

నెల్లూరు నగరంలో మైపాడురోడ్డు ఆక్రమణల మయంగా మారింది. పాత చెక్‌పోస్టు నుండి మైపాడు గేటు వరకు ఈ రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలే! దీంతో ఈ రోడ్డు బాగా తగ్గిపోయింది. ముఖ్యంగా బోడిగాడి తోట ప్రాంతంలో రోడ్డు మీదనే ఆక్రమణలున్నాయి. ఇక్కడ వుంటున్న వాళ్ళు తరుచూ రోడ్డు మీద కొస్తుండడం, పిల్లలు రోడ్డు మీదే ఆడుకుంటుండడంతో వాహనదారులకు చాలా ఇబ్బందిగా ఉంటుంది. మైపాడుగేటు సెంటర్‌లో కూడా రోడ్డుకిరువైపులా వున్న ఆక్రమణలతో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా వుంటుంది. ఈ ఆక్రమణలు తొలగించి రోడ్డును విస్తరించడంపై అధికారులు దృష్టి సారించాల్సివుంది.

# ఇందిరాభవన్‌లో పెద్దాయన జయంతి



దుప్పట్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మాజీముఖ్యమంత్రి, కాంగ్రెస్‌పార్టీయే ఊపిరిగా, ఆ పార్టీయే జీవితంగా ఎంచుకున్న నాయకుడు స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి జయంతిని 20వ తేదీ నెల్లూరు ఇందిరాభవన్‌లో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు టి.బాలసుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యకమంలో ఉడతా వెంకట్రావ్, రఘురాం ముదిరాజ్, టి.బాలసుధాకర్, అనూరాధ తదితరులు పెద్దాయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, జయంతి కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, సి.వి.శేషారెడ్డి, చేవూరు దేవకుమార్‌రెడ్డి, కావలి వెంకట్రావ్, పి.చెంచలబాబు యాదవ్, ప్రత్తి సీతారాంబాబు, శివాచారి, కేశవ నారాయణ, అల్లావుద్దీన్, శ్రీనివాసరాజు, ఖాలేషా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు తమ ప్రసంగాలలో రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అభివృద్ధి కోసం పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజల సంక్షేమం కోసం నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

# నెల్లూరు కబుర్లు

# నగరమంతా పనుల జాతర

నెల్లూరు నగరంలో దాదాపు 58కోట్లతో అన్ని డివిజన్‌లలోనూ ఎస్సీ సబ్‌ప్లాన్ క్రింద సి.సి రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ పనులను మార్చి నెలాఖరులోపు పూర్తి చేయాల్సి వుంది. లేకుంటే ఆ నిధులు వెనక్కిపోతాయి. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాల్సి వుండడంతో మంత్రి నారాయణ చొరవ తీసుకుని పదేసి డివిజన్‌లలో పనులను ఒక్కో బ్లాక్‌గా చేసి ఎల్ అండ్ టి, మెగా కన్‌స్ట్రక్షన్స్, షాపుంజి వంటి కంపెనీలకు ఈ పనులు అప్పగించినట్లు తెలుస్తోంది. తొందరగా పనులు పూర్తి చేయాల్సి రావడంతో అన్ని డివిజన్‌లలోనూ ఈ నెలాఖరులోపే పనులు మొదలుపెట్టేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

## సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ ద్వారా

# సురక్షిత మంచినీరు

## - మేయర్ అబ్దుల్ అజీజ్



సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకును పరిశీలిస్తున్న మేయర్ అబ్దుల్ అజీజ్

నగరంలోని సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ ద్వారా మరో నెల రోజుల్లో ప్రజలకు అత్యంత సురక్షిత మంచినీరు అందిస్తామని నగర మేయర్ అబ్దుల్ అజీజ్ అన్నారు. అంతర్జాతీయ స్థాయి ఓజోనేటెడ్ వాటర్ సాంకేతిక పరిజ్ఞానంతో ఈ కార్యక్రమం వేగవంతంగా రూపుదిద్దుతామన్నారు. ఈ నెల 18న ఆయన సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను సందర్శించి చెన్నైకి చెందిన ఓజోనేటెడ్ కంపెనీ ప్రతి నిధులతో కలిసి నీటిని పరీక్షించారు. నీటి శుద్ధికి ప్రస్తుతం వినియోగిస్తున్న క్లోరినేషన్ విధానం కన్నా వందరెట్ల సామర్థ్యంతో నీటిని శుద్ధి చేసే ఓజోనేటెడ్ వాటర్ సాంకేతిక పరిజ్ఞానం పనిచేస్తుందన్నారు. నగరంలో తొలిసారిగా ఈ విధానాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందజేసేందుకు సంబంధిత శాస్త్రవేత్తలతో కలిసి పరిశీలనలు చేస్తున్నామన్నారు. ట్యాంక్ వద్ద జరిపే పరీక్షలే కాకుండా, ఇళ్ళకు నీటిని సరఫరా అయ్యేంతవరకు, అన్ని దశల్లో మధ్యమధ్యలో నిర్వహించాల్సిన పరీక్షలన్నీ క్రమబద్ధంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నన్నేసాహెబ్, కార్పొరేటర్లు రాజానాయుడు, బొల్లినేని శ్రీవిద్య, మేకల రజని, మన్నెం పెంచలనాయుడు, నాయకులు షంషుద్దీన్, నగరపాలక సంస్థ అధికారులు షరీఫ్, లక్ష్మణమూర్తి, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్వహణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పగిలిన మోకాలును అతికించిన "సాధన"



వివరాలను వెల్లడిస్తున్న వైద్యులు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ అశ్విన్, పక్కన బాధితుడు మహేష్

నెల్లూరు పొగతోటలోని సాధన ఆర్థోపెడిక్స్ ఆసుపత్రి వైద్యులు రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జైన మోకాలిచిప్పను ఆరు గంటల పాటు శ్రమించి శస్త్ర చికిత్స ద్వారా విజయవంతంగా అతికించి సాధారణ స్థితికి తీసుకొచ్చారు. ఈ నెల 17వ తేదీన సాధన ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్లు పోలుబోయిన అశ్విన్‌కుమార్, పాబోలు రామకృష్ణలు మాట్లాడారు. నెల్లూరు ఎన్టీఆర్ నగర్‌కు చెందిన మహేష్(25) జనవరి 14న బైక్‌పై లేగుంటపాడు వెళ్తూ ప్రమాదవశాత్తు చెక్కబండిని ఢీకొనడంతో మోకాలి చిప్ప ముక్కలైంది. తొలుత ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకెళ్ళగా వైద్యులు పరీక్షించి కాలు తొలగించాలని తెలిపారు. కుటుంబసభ్యులు భయపడి మరో కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకెళ్ళగా అక్కడి వైద్యులు పరీక్షించి రెండు, మూడు రోజులపాటు పరిశీలనలో ఉంచాలన్నారు. అప్పటికే బాధితుడి కాలికి ఇన్‌ఫెక్షన్ సోకింది. చివరగా సాధన ఆర్థోపెడిక్స్ ఆసుపత్రికి తీసుకురాగా వైద్యులు గాయాన్ని పరీక్షించి ముక్కలైన మోచిప్పను ఆరుగంటలపాటు శస్త్ర చికిత్స జరిపి అతికించారు. ఎన్టీఆర్ వైద్య సేవా పథకం క్రింద పూర్తి ఉచితంగా శస్త్రచికిత్సను చేసినట్లు వైద్యులు తెలిపారు. మత్తు వైద్యనిపుణుడు డాక్టర్ గోవింద్ పాల్గొన్నారు.

# సమ్మెలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు

జిల్లాలోని 2800మంది విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ 20వ తేదీ నుండి విధులను బహిష్కరించి సమ్మెకు దిగారు. నెల్లూరులోని విద్యుత్ భవన్‌తో పాటు జిల్లాలోని అన్ని విద్యుత్ డి.ఇల కార్యాలయాల ఎదుట కార్మికులు సమ్మెకు కూర్చున్నారు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరణ చేయాలని, ఉద్యోగ భద్రతను కల్పించాలని, సంస్థలో కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేయాలని, మీటర్ రీడర్లకు పీసు రేటు విధానాన్ని రద్దు చేసి కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్ కుమార్‌యాదవ్, డీసీసీ అధ్యక్షులు పనబాక కృష్ణయ్య, సిఐటియు, ఇతర ట్రేడ్ యూనియన్‌లు విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెకు మద్దతు ప్రకటించారు.

## ● భక్తి ముసుగులో ఛీటింగ్

# సుధాకర్ బాబా(య్)..

### ➤ లబోదిబో మంటున్న బాధితులు

తాజాగా నెల్లూరు కేంద్రంగా అమాయక భక్తుల నెత్తిన ఓ బురిడీ బాబా టోపీ పెట్టిన సంఘటన వెలుగులోకి వచ్చింది. నెల్లూరు మైపాడుగేటు సెంటర్‌లోని ప్రశాంత్‌నగర్‌లో సుధాకర్ మహరాజ్ ఆశ్రమం ఉంది. ఇతని పేరు సుధాకర్‌రావు. ఒకప్పుడు జడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడు. ఆ తర్వాత జడ్పీ ఛైర్మెన్‌లుగా వున్న చెంచలబాబు వద్ద, కాకాణి గోవర్ధన్‌రెడ్డిల వద్ద సి.సి.గా కూడా పనిచేశాడు. ఇలా ప్రభుత్వ ఉద్యోగంలో వున్నప్పుడే జాతకాలు గట్రా చూసేవాడు. భవిష్యత్ వాణి అంటూ ఏదేదో చెప్పేవాడు. ఇలా అతను ఒక బాబాగా, మహిమలున్న ఆధ్యాత్మిక వేత్తగా పేరు తెచ్చుకున్నాడు. అతనికి అమాయక, పిచ్చి భక్తులు ఏర్పడ్డారు. ఈ కాలంలో బాబా అంటే కొందరు రాజకీయ నాయకులు, కొందరు ఉన్నతాధికారులు వచ్చి పోతుండడం ఫ్యాషన్. ఈ సుధాకర్‌మహరాజ్ కూడా అలాంటి బ్యాన్‌ను మెయింటెన్ చేయసాగాడు. బాగా చదువుకున్నోళ్ళే ఇలాంటి బాబాలను నమ్ముతుంటే, ఇక అంతంత మాత్రం జ్ఞానం వున్న సామాన్య ప్రజల పరిస్థితేంటి? వాళ్ళు కూడా ఈయన దగ్గర ఏవో మహిమలున్నాయని చెప్పి నమ్మసాగారు. ఆయన వద్దకు పోసాగారు. ఇలా పెరిగిన పిచ్చి భక్తులతో సుధాకర్ భక్తి వ్యాపారం మొదలుపెట్టాడు. ఇక్కడ నిత్యం హోమాలు, పూజలు నిర్వహించేవాళ్ళు. వచ్చిన వాళ్ళకు టిఫిన్, తిండి దండిగా పెట్టేవాళ్ళు. భక్తులు ఇక్కడే కొంత బెండ్ అయ్యేవాళ్ళు. గత ఏడాది డిసెంబర్ నుండి ఆశ్రమంలో 'నవనాత సంప్రదాయ శ్రీ దత్తాత్రేయ మహామంత్ర ఇష్టకామ్య మహాయాగం' మొదలుపెట్టారు. ఈ ముసుగులోనే మంత్ర పీఠికల పేరుతో మోసానికి పాల్పడ్డారు. వెయ్యి రూపాయలు పెట్టి ఒక మంత్రపీఠికను తీసుకెళ్ళి 12రోజుల లోపల తిరిగి తెచ్చిస్తే ఆశ్రమం వాళ్ళు 1400 రూపాయలు ఇస్తారు. ఇలా నెలలో రెండుసార్లు తీసుకెళితే పెట్టుబడి రెండింతలవుతుంది. ఇంకేముంది పిచ్చి జనం ఎగబడ్డారు. పది కాదు, పాతిక కాదు, 50వేలు... ఇలా పెట్టుబడులు పెట్టి మంత్ర పీఠికలు తీసుకెళ్ళేవాళ్ళు. 12రోజులకు మళ్ళీ తెచ్చిచ్చే వాళ్ళు. పెరిగిన వాళ్ళ పెట్టుబడికి తగ్గట్టుగా మళ్ళీ మంత్రపీఠికలు తీసుకెళ్ళే



దయ చేసి వినండి... దయచేసి వినండి... మంత్రాలకు చింతకాయలు రాలవు... అని ఎందరు చెబుతున్నా వింటారా? వినరు? దయ చేసి బురిడీ బాబాలను నమ్మొద్దని మేధావులు మొత్తు కుంటుంటారు... అయినా వింటారా? వినరు! మోసం చేసేవాడికి మోసపోయే వాడెప్పుడూ లోకువే. మీరు కట్టిన డబ్బుకు 28రోజుల్లో రెట్టింపు ఇస్తామని ఓ భోగస్ కంపెనీ వాళ్ళు బోర్డు పెడితే తీసుకెళ్ళి లక్షలు లక్షలు కట్టారు. గ్రీన్ గ్లోరి అంటూ చైన్‌లింక్ స్కీం ద్వారా మీరు ఒకసారి డబ్బులు కడితే ఇక మీ ఇంటికి డబ్బుల వరదేనంటే... దానికీ కోట్లు కట్టారు. కొన్ని క్రిష్టియన్ సంస్థలు మనీ సర్క్యులేషన్ స్కీం అంటూ వందల కోట్ల రూపాయలకు జనం నెత్తిన టోపీ పెట్టాయి.

## ● కోట్ల రూపాయలకు టోపీ

# కొంప ముంచాడు బాబోయ్

### ➤ పోలీసుల అదుపులో కీలక నిందితురాలు

వాళ్ళు. ఇలా మంత్ర పీఠికలు తీసుకెళ్ళడమే కాని ఎవరూ డబ్బులు తీసుకోలేదు. చైన్‌లింక్ స్కీంలాగా భక్తుల నమ్మకాన్ని డబ్బుల రూపంలో మూటగట్టుకున్నారు. ఇటీవల వాసవి అనే మహిళ పెద్దపెద్ద సంచుల్లో ఆశ్రమం నుండి డబ్బును తరలించే ప్రయత్నం చేస్తుండగా భక్తులు అడ్డుకోవడంతో మోసం బయటపడింది. తన బండారం బయటపడడంతో సుధాకర్ బాబా పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. అతనిని ఆసుపత్రిలో చేర్చారు. డబ్బును తరలించడానికి ప్రయత్నించిన వాసవి అనే మహిళను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లుగా తెలుస్తోంది. దాదాపు 250మంది బాధితులు ఉన్నట్లుగా తెలుస్తోంది. మొత్తం స్కాం ఎన్ని కోట్లో ఇంకా లెక్కలు తేలాల్సివుంది. రోజురోజుకూ బాధితులు పెరుగుతున్నారు. చాలారోజుల క్రితమే ఈ భాగోతానికి స్కెచ్ వేసినట్లు సమాచారం. సుధాకర్‌బాబాతో పాటు ఓ మీడియా ప్రతినిధి, వాసవి అలాగే ఓ ఎర్రచందనం స్మగ్లర్ కూడా ఈ పాపానికి వ్యూహరచన చేసినట్లు తెలుస్తోంది. తాను పారిపోవడం విఫలం కావడంతో సుధాకర్‌బాబు గతిలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నిం చాడు. ప్రస్తుతం అతను ఆసుపత్రిలోనే ఉండి హైకోర్టు ద్వారా బెయిల్ సంపాదించు కునే పనుల్లో ఉన్నాడు. ఈ భాగోతంలో కీలక వ్యక్తులను అదుపులోకి తీసుకున్న నెల్లూరురూరల్ సిఐ శ్రీనివాసులురెడ్డి లోతుగా దర్యాప్తు నిర్వహిస్తూ ఈ భాగోతాన్నంతా బయటపెట్టేందుకు కృషి చేస్తున్నాడు. చేతులు కాలాకా ఆకులు పట్టుకున్నట్లు బాధితులు మాత్రం పోలీసు స్టేషన్‌ల ముందు చేరి తమకు న్యాయం చేయాలంటూ మొరపెట్టుకుంటున్నారు. అక్షర జ్ఞానంలేని అమాయకులు కొంచెం ఆశకుపోయే పేదలు ఇలాంటి దొంగ సన్యాసులను నమ్మారంటే అర్ధముంది. ప్రజాప్రతినిధులు, మంత్రులుగూ పనిచేసిన వాళ్ళు, ఉన్నత చదువులు చదివిన అధికారులు కూడా ఇలాంటి దొంగ బాబాలను నమ్మి ఫోటోలకు ఫోజులివ్వడం చూస్తుంటే అసలు అజ్ఞానం ఎవరిలో ఉందా అనే అనుమానం వస్తుంది! మొత్తానికి భక్తి ముసుగులో జనం అమాయకత్వంతో వ్యాపారం చేయొచ్చని ఈ సంఘటన ద్వారా తేటతెల్లమైంది.

# మనిషి జీవితం సైన్స్‌తో ముడిపడివుంది

### - మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

మనిషి జీవితం సైన్స్‌తో ముడిపడి ఉందని రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు సంతపేటలోని సెయింట్ జోసఫ్ బాలికల పాఠశాలలో నిర్వహిస్తున్న 'ఇన్‌స్పైర్ మనక్-2018' ఈ నెల 17న ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సోమిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుని మంచి శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. సైన్స్ అంటే కేవలం రాకెట్ ప్రయోగమేకాదని, ప్రతి విషయంలో టెక్నాలజీ ఉందన్నారు. మానవుడికి సైన్స్ ఉపయోగపడే విధంగా కొత్త ఆవిష్కరణలు చేపట్టాలని సూచించారు. సుమారు 40లక్షల మంది రైతులకు ఈ-క్రాప్ బుక్స్, సాయిల్ హెల్త్ కార్డ్స్ ఇవ్వడం జరిగిందని, శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా నేల స్వభావం తెలుసుకునే స్థాయికి మన సాంకేతికత అభివృద్ధి చెందిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి రూ.20వేల కోట్లను కేటాయించిందన్నారు. అనంతరం ఇన్‌స్పైర్ మనక్‌లో జిల్లా వ్యాప్తంగా 432 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించగా అందులో రాష్ట్ర స్థాయిలో ఎంపికైన 42 ప్రాజెక్టులను ప్రదర్శించిన విద్యార్థులకు మంత్రి సోమిరెడ్డి చేతుల మీదుగా మెమెంటోలు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. జాయింట్ కలెక్టర్-2 వెంకటసుబ్బారెడ్డి, వివిఎస్‌యూ విసి వీరయ్య, మేయర్ అబ్దుల్ అజీజ్, డిఇఓ శామ్యూల్, జిల్లా సైన్స్ అధికారి వి.రాధారాణి, ఎస్‌సి ఇఆర్‌టి ప్రొఫెసర్ హారతి, టిడిపి నాయకులు ధర్మవరం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మెమెంటో, సర్టిఫికేట్‌లు ప్రదానం చేస్తున్న మంత్రి సోమిరెడ్డి

# పార్కులకు మహర్దశ

### - మంత్రి పొంగూరు నారాయణ



మాగుంట లే-అవుట్‌లోని పార్కును పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

రాష్ట్ర ప్రభుత్వం పార్కుల అభివృద్ధికి నిధులు కేటాయించి కృషి చేస్తోందని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డా॥ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. ఈ నెల 18న ఆయన నెల్లూరురూరల్ ప్రాంతాలయిన సర్దార్ వల్లభాయిపటేల్‌నగర్‌లోని రిత్విక్ సెంటర్, షార్ కాలనీ, అన్నమయ్య సర్కిల్, లెక్చరర్స్ కాలనీ, అనీల్ గార్డెన్స్, సరస్వతి నగర్‌లలో విస్తృతంగా పర్యటించి పార్కులన్నింటిని పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పచ్చదనం(గ్రీన్ & బ్లూ) అభివృద్ధికి కృషి చేస్తుందని, పిల్లలకు చదువులు తప్ప వేరే వ్యాపకం లేదని, క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం పార్కుల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. రానున్న 3నెలల కాలంలో పార్కులను అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టబోతున్నారు. రిత్విక్ సెంటర్, షార్ కాలనీల్లో 4పార్కుల అభివృద్ధికి ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రస్తుతం జిల్లాలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు వల్ల ఎక్కడ పడితే అక్కడ రోడ్లు తవ్వుతున్నారని, ప్రజలు కొంత అసౌకర్యానికి గురవడం వాస్తవమని, జూన్ నెలాఖరు నుండి 6 నెలల్లో రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ అబ్దుల్ అజీజ్, మాజీశాసనసభ్యులు ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర టిడిపి మహిళా ఉపాధ్యక్షురాలు టి.అనూరాధ, జడ్పీటీసీ ముప్పాళ్ల విజేత, హెచ్‌డివిఎస్ ఛైర్మెన్ చాట్ల నరసింహారావు, ఆనం జయకుమార్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# దేవుడి పేరుతో దోచే దొంగలను తన్నాలి!

### - నగర ఎమ్మెల్యే డా. అనిల్

దేవుడి పేరుతో ప్రజలను మోసం చేసేవారిని కఠినంగా శిక్షించాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ డిమాండ్ చేశారు. నెల్లూరు నాల్గవ డివిజన్‌లోని కిసాన్‌నగర్ ప్రాంతంలో ఆయన ఈ నెల 19న పర్యటించి 'ప్రజాదీవెన' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రశాంతినగర్‌లో ఆశ్రమం నిర్మించి సుధాకర్ మహారాజ్ అనే వ్యక్తి దేవుడి పేరుతో పేదలు, మహిళలు, మధ్య తరగతి ప్రజల నుంచి కోట్లాదిరూపాయలను దండుకుని మోసగించడం దారుణమన్నారు. ఈ విషయంలో ఆయన వెనుక ఇంకెంతమంది సూత్రధారులు ఉన్నారో వారందరినీ విచారించాలని, దేవుని పేరుచెప్పి మోసగించిన వారినెవరినీ వదలకుండా వారందరినీ శిక్షించాలన్నారు. దాదాపు 80 కోట్ల రూపాయల దాకా పేద ప్రజలు ఈ మోసానికి గురైనట్లు తెలుస్తోందని, వెయ్యి రూపాయలకు 1400 ఇస్తామనే మోసపు మాటలతో ప్రజలకు ఆశచూపి మోసగించారని, ఈ విషయంలో జిల్లా ఎస్పీ వెంటనే స్పందించి ప్రజలను మోసగించిన సుధాకర్ మహరాజ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అతని ఆస్తులు ఎక్కడెక్క



బాధితులను వివరాలడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్

డున్నాయో అన్నిటినీ సీజ్ చేసి, ప్రతి పైసా వసూలుచేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఓబిలి రవిచంద్ర, వైఎస్సార్సీపి డివిజన్ ఇన్‌ఛార్జి పోలంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, హరిప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# హోదా కోసం ఉద్యమం

**- జిల్లా కాంగ్రెస్ నేతలు**

ఏపికి ప్రత్యేక హోదా సాధించేవరకు కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం కొనసాగుతుందని డీసీసీ అధ్యక్షులు పనబాక కృష్ణయ్య పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీ నెల్లూరు, ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ, టీడీపీ ప్రభుత్వాలు రాష్ట్రానికి తీరని ద్రోహం చేసాయన్నారు. రాష్ట్రానికి ఐదేళ్ళు కాదు, పదేళ్ళు హోదా కావాలని ఒకాయన అంటే కాదు 15ఏళ్లు ఇస్తామని ఇంకో బీజేపీ పెద్దమనిషి ఊదరగొట్టారని, కేంద్రంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక బీజేపీ, టీడీపీలు రెండూ హోదా అంశాన్ని గోదాట్లో తోసాయన్నారు. చంద్రబాబు నిర్వాకం వల్ల రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది. ఆయన రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధించే విషయంలో చిత్తశుద్ధి చూపలేదు. బీజేపీ అధికారంలోకి రాకముందు హోదా అంది, గద్దెనెక్కాక ప్రత్యేకప్యాకేజీ అంది. ఇప్పుడేమో ప్రత్యేక సాయం అని మాట మారుస్తున్నారు. విభజన చట్టంలో రాష్ట్రానికి 5లక్షల కోట్ల విలువైన 11విద్యాసంస్థలు, 19ప్రాజెక్ట్‌లను చూపించారు. కాని గత నాలుగేళ్లలో 50 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు కూడా రాలేదని ఆయన విమర్శించారు. ప్రత్యేకహోదా ఉద్యమంలో భాగంగా ఈ నెల 23 నుండి 27వ తేదీ వరకు జిల్లాలోని అన్ని ఆర్డీఓ కార్యాలయాల ఎదుట ఆత్మగౌరవ దీక్షలు చేస్తామని, మార్చి 2వ తేదీన జాతీయ రహదారిని దిగ్భంధనం చేస్తామని, మార్చి 6, 7, 8తేదీలలో రాష్ట్రంలో 13జిల్లాల నుండి ఛలో పార్లమెంటు కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు.

ఈ సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సి.వి.శేషారెడ్డి, చేవూరు దేవకుమార్‌రెడ్డి, పి.చెంచలబాబుయాదవ్, జిల్లా నాయకులు ఉడతా వెంకట్రావ్, రఘురాం ముదిరాజ్, శివాచారి, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.




# వ్యాయామం.. ఆరోగ్యానికి ఎంతో మంచిది

**- జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ**



వ్యాయామం ఆరోగ్యానికి ఎంతో మంచిదని, ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజూ వ్యాయామం తప్పనిసరి అని జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ అన్నారు. చెముదుగుంటలోని పోలీసు శిక్షణ కళాశాలలో ట్రైనీ కానిస్టేబుళ్ళకు నిర్వహించిన క్రీడా పోటీలు ఈ నెల 18తో ముగిశాయి. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన ట్రైనీ కానిస్టేబుళ్ళకు జిల్లా ఎస్పీ బహుమతులందజేసి మాట్లాడుతూ, ట్రైనీ కానిస్టేబుళ్ళు శిక్షణా కాలం తర్వాత కూడా వ్యాయామాన్ని కొనసాగించి మంచి ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శరత్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ సూర్యచంద్ర, స్పోర్ట్స్ ఫౌండేషన్ కార్యదర్శి సాయిబాబా పాల్గొన్నారు.

# ఆన్‌లైన్లో రవాణాసేవలు

రవాణాశాఖకు సంబంధించిన మరిన్ని సేవలను ఆన్‌లైన్లో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు రవాణాశాఖ కమిషనర్ ఎన్.శివరాంప్రసాద్ తెలిపారు. ఈ నెల 17న నెల్లూరు బి.వి.నగర్‌లోని రవాణాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాహన ట్రాన్స్‌ఫర్లు, ఫైనాన్స్ రద్దు, ఎన్‌ఓసిలు, అడ్రస్సు మార్పు, పన్ను చెల్లింపుల కోసం https//aprta. epragathi.org, ఎల్ఎల్ ఆర్‌లు, కొత్త లైసెన్సులు, రెన్యూవల్, అడ్రస్ మార్పు, నంబర్ బిడ్డింగ్, తదితర సేవలకు https//aprtacitizen.epragathi.org వెబ్‌సైట్‌లను సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాలో 157 కామన్ సర్వీసు సెంటర్లు ఉండగా నెల్లూరు నగరంలో 89 ఉన్నాయన్నారు. ఎవరిమీద ఆధారపడకుండా సర్వీసు సెంటర్ల ద్వారా సేవలను పొందవచ్చన్నారు. కామన్ సర్వీసు సెంటర్ల డిఎం, ఎంవిఐ సీతారామిరెడ్డి, ఏఎంవిఐ రవికుమార్, పరిపాలనాధికారి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

---

## గూడూరు డివిజన్ వార్తలు

# చంద్రన్న బీమా చెక్కుల పంపిణీ



చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఛైర్‌పర్సన్ దేవసేన

గూడూరు పట్టణంలోని పలు వార్డుల్లో చంద్రన్న బీమా చెక్కులను ఈ నెల 17న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు భరోసాగా చంద్రన్న బీమా ఎంతో ఉపయోగపడుతుందని, సీఎం చంద్రబాబునాయుడు దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపిలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చంద్రన్న బీమాను ప్రవేశపెట్టారని అన్నారు. చంద్రన్నబీమా పేదలకు ఆసరాగా నిలుస్తుందని తెలియజేశారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన కుటుంబాలకు సీఎం చంద్రన్నబీమా నగదును అందించి ఆసరాగా నిలిచారన్నారు. పురపాలక సంఘ అధ్యక్షురాలు పొనకా దేవసేన మాట్లాడుతూ చంద్రన్నబీమాలో పేర్లు నమోదు చేసుకోనివారు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఎంతోమంది పేదలకు చంద్రన్నబీమా నగదు ద్వారా కొంత సాయం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కల్లన, చంద్రయ్య, తెలుగుదేశం నాయకులు శ్రీధర్, మెప్మా టిఎంసి శ్రీహర్షిత, సివో దుర్గేష్‌కుమార్, బీమా మిత్ర సునీత తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 18వ తేదీన గూడూరులోని పియర్ క్లబ్ 123వ వార్షికోత్సవం సందర్భంగా క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న మాజీఎమ్మెల్యే ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి. వేదికపై పియర్ క్లబ్ అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శి ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కె.సుందరరామిరెడ్డి

# కార్మికులకు గుర్తింపుకార్డులివ్వాలి

**- సిఐటియు అధ్యక్షులు పుట్టా శంకరయ్య**

హెల్పర్‌బోర్డులో నమోదు చేసుకొన్న కార్మికులందరికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పెండింగ్‌లో వున్న క్లైమ్‌లు అన్నీ వెంటనే పరిష్కరించాలని సిఐటియు అధ్యక్షులు పుట్టా శంకరయ్య తెలిపారు. మంగళవారం గూడూరులో దీనిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హెల్పర్ బోర్డులు నుంచి అక్రమంగా తీసుకొన్న భవన నిర్మాణ కార్మికుల మొత్తాన్ని వెంటనే తిరిగి చెల్లించాలని, ప్రమాద మరణాలకు, సహజమరణాలకు, అంగవైకల్యానికి సంబంధించి క్లైమ్‌లను చంద్రన్నబీమా నుంచి కాకుండా నేరుగా బిల్డింగ్ వర్కర్స్ హెల్పర్ బోర్డు ద్వారానే అమలు చేయాలని, 60సం॥లు దాటిన కార్మికులను కూడా హెల్పర్‌బోర్డులో కొనసాగించాలని, వారి కుటుంబాలకు హెల్పర్‌బోర్డు ద్వారా అమలవుతున్న పథకాలు అమలు చేయాలని, నిర్మాణ కార్మికులకు వృద్ధాప్య, వితంతు, అంగవైకల్య పెన్షన్లు, కార్మికుల పిల్లల చదువులకు స్కాలర్‌షిప్‌లు, వైద్యం, గృహ నిర్మాణం సంబంధించిన సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ప్రమాదం చేత మరణించినవారికి 10లక్షలు, సహజ మరణానికి 3లక్షలు బిల్డింగ్ వర్కర్స్‌కు హెల్పర్ బోర్డు ద్వారానే అమలు చేయాలని, వివాహమునకు యాభైవేలు పెంచి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో కార్యదర్శి బండి కృష్ణయ్య, గౌరవాధ్యక్షులు వి.వి.రమణయ్య, సహాయ కార్యదర్శి పర్వతాల శివయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు అధ్యక్షులు పుట్టా శంకరయ్య, వి.వి.రమణయ్య తదితరులు

# పోలేరమ్మ తల్లి మండపానికి శంకుస్థాపన



గూడూరు డివిజన్ చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులోని శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ తల్లి దేవస్థానం ఆవరణంలో రూ.55లక్షలతో నూతనంగా నిర్మించనున్న శ్రీశ్రీశ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థానం మండపానికి, శ్రీ గురునాథస్వామి దేవస్థానానికి మరియు సాంస్కృతిక కళావేదికకు ఇటీవల జిల్లా మంత్రి పొంగూరు నారాయణ శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, దేవస్థానం ఈఓ, పాలకమండలి ఛైర్మన్ ఆనందరెడ్డి, సభ్యులు పట్టాభిరెడ్డి, అమరనాథ్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, వెంకటకృష్ణయ్య, అంబరీష్, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఉపకారవేతనాలివ్వండి

**- ఏఐఎస్ఎఫ్**

అపరిష్కృతంగా ఉన్న విద్యార్థుల ఉపకారవేతనాలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకుడు పవన్ తెలిపారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవిద్యార్థులకు చెల్లించాల్సిన ఉపకారవేతనాలను ప్రభుత్వం ఇంతవరకు చెల్లించకపోవడం బాధాకరమని చెప్పారు. సీఎం చంద్రబాబునాయుడు విద్యార్థులపైన వివక్షత చూపుతున్నారని తెలిపారు. ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతున్న సందర్భంగా కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు అబ్బాస్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

శ్రీను గల్పిక

# హోదాపై చేతులు కలిపిన ఏపి నేతలు

ఢిల్లీలోని ప్రధాని కార్యాలయం. ప్రధాని నరేంద్రమోడీతో పాటు బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా, కేంద్రమంత్రులు అరుణ్‌జైట్లీ, రాజ్‌నాథ్‌సింగ్, అనంతకుమార్, స్మృతి ఇరాని, నిర్మలా సీతారామన్ తదితరులున్నారు. నరేంద్రమోడీ వుండి వారితో... మన ప్రభుత్వ లక్ష్యాలు ప్రధానంగా రెండు... ఒకటి కాంగ్రెస్ రహిత భారత్. రెండు క్యాష్ రహిత భారత్. మొదటి విషయంలో చాలావరకు విజయం సాధించాం. కాంగ్రెస్‌పార్టీ బాధ్యతలను రాహుల్‌గాంధీకి అప్పగించేసారు కాబట్టి, మిగతాది ఆయన చూసుకుంటాడు. రెండోది క్యాష్ రహిత భారత్. ఇది ఎంతవరకు వచ్చిందని ప్రశ్నించాడు. అప్పుడు అరుణ్‌జైట్లీ... సార్, నోట్ల రద్దు ద్వారా చాలామంది వద్దవున్న నగదును ఊడ్చేసాం. ఇక లలిత్‌మోడీ, నీరవ్ మోడీ, విజయ్‌మాల్యా వంటి వాళ్ళు బ్యాంకుల వద్ద నగదును ఊడ్చేసే పనిలో వున్నారు. కార్పొరేట్ కంపెనీలకు, నీరవ్ మోడీ లాంటివాళ్ళకు ఫ్రీహ్యాండ్ ఇస్తే దేశంలో వున్న బ్యాంకులన్నీ క్యాష్‌లెస్ బ్యాంకులుగా మారుతాయి. ఇక జీఎస్టీ దెబ్బకు చాలామంది వద్ద డబ్బులేకుండా పోయింది. మనం పారిశ్రామికవేత్తలకు ఇలానే వేలకోట్లు ఋణాలు ఇచ్చుకుంటూ పోతే, జీఎస్టీ చట్టాన్ని ఇలాగే కఠినంగా అమలు చేసుకుంటూపోతే త్వరలోనే మనం క్యాష్ రహిత భారత్‌ను చూడగలం సార్. ఆ నమ్మకం నాకుంది అని చెప్పాడు. దానికి మోడీ... సరే ఆ ఇష్యూను మీరు హ్యాండిల్ చేయండి, ఇక ఏపి వాళ్ళ ప్రత్యేకహోదా గొడవ ఎంతవరకు వచ్చింది అని అడిగాడు. దానికి జైట్లీ... ఏపికి ప్రత్యేకహోదా కోసం తన ఎంపీల చేత రాజీనామా చేయిస్తానని వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ప్రకటించాడు. అంతేకాదు, తన పోరాటానికి కలిసి రావాలని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లకు కూడా పిలుపునిచ్చాడు అని చెప్పాడు. జగన్ అంత మాటన్నాడా అంటూ నరేంద్రమోడీ కళ్ళు తిరిగి కుర్చీలోనే కూలబడ్డాడు.

★★★★★

విజయవాడ రైల్వేస్టేషన్... 7వ నెంబర్ ఫ్లాట్‌ఫారం మీద ఢిల్లీకి వెళ్ళే స్పెషల్ ట్రైన్ ఆగివుంది. అన్ని భోగీల నిండా టీడీపీ, వైసిపి, జనసేన, వామపక్షాల కార్యకర్తలున్నారు. అప్పుడే హైటెక్‌రత్న చంద్రబాబు వచ్చాడు. బ్యాక్ గ్రౌండ్‌లో 'తెలుగు వీర లేవరా... ప్రత్యేకహోదాకై పోరాడరా' అనే పాట పెట్టారు. చంద్రబాబు బి2 భోగీ వద్ద నిలబడ్డాడు. మంత్రి సోమిరెడ్డి వచ్చి... సార్, మీరు ఎక్కి కూర్చోండి అని అడిగాడు. అందుకాయన... ఇంకా జగన్ రాలేదు, ఆ అబ్బాయి కూడా వస్తే కలిసి ఎక్కుదాం అని చెప్పాడు. అప్పుడే ఫ్లాట్‌ఫారం మీదకు జగన్ వచ్చాడు. వెనుక వేలాదిమంది కార్యకర్తలు బ్యాక్‌గ్రౌండ్‌లో 'జగనన్నా జగనన్నా జగమంతా నువ్వన్నా... ప్రత్యేకహోదాకై పదరన్నా...' అనే పాట వచ్చింది. జగన్ నేరుగా బి2 భోగీ వద్దకు వెళ్లాడు. చంద్రబాబు ఎంతో అభిమానంగా జగన్‌ను కౌగిలించుకుని... జగన్ మన రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇచ్చేవరకు ఢిల్లీ నుండి కదిలేదిలేదన్నాడు. దానికి జగన్... నేనెప్పుడో సిద్ధం... అందుకోసం ఓ పదిజతల బట్టలు కూడా తెచ్చుకున్నాను అని చెప్పాడు. ఈలోపల వామపక్షాల నాయకులు మధు, నారాయణ, రామకృష్ణ, లోక్‌సత్తా జేపి, ఉండవల్లి అరుణ్‌కుమార్‌లు కూడా వచ్చి అదే భోగీ ఎక్కారు. అప్పుడే సిగ్నల్ ఇవ్వడంతో రైలు కదలసాగింది. ఇక ఎక్కు జగన్ అని చంద్రబాబు అన్నాడు. మన పవన్ ఇంకా రాలేదా్ర అని జగన్ చెప్పాడు. పవన్ ఫ్లైట్‌కేమన్నా వస్తాడేమోలే అని చంద్రబాబు అన్నాడు. లేదు, మనతో పాటే రైలులో వస్తానన్నాడు. మనతో కలిసే జర్నీ చేయాలని ఉందంట అని జగన్ చెప్పాడు. ట్రైన్ అన్నా లాగి ట్రైన్‌ను ఆపుదామా అని చంద్రబాబు అడిగాడు. అదుగో వచ్చేస్తున్నాడు. ఫర్వాలేదు. ఇక ఎక్కేయండి అని జగన్ చెప్పాడు. చంద్రబాబు, జగన్‌లు ట్రైన్ ఎక్కి డోర్ వద్ద నిలబడ్డారు. పవన్ భుజాన బ్యాగ్‌తో పరుగెత్తుకుంటూ భోగీ వద్దకు వచ్చాడు. జగన్ డోర్ వద్ద నిలబడే చేయి చాచాడు. పవన్ ఆ చేయి పట్టుకుని ట్రైన్‌లోకి జంప్ చేశాడు. ఢిల్లీ వైపు ట్రైన్ దూసుకుపోసాగింది. బి2 భోగీలో ఏపి నేతలందరూ ఒకరితో ఒకరు సరదాగా వుండసాగారు. జగన్ తాను తెచ్చుకున్న వేరుశెనగ ముద్దలను అందరికీ పంచితే, చంద్రబాబు బాదంపప్పు, జీడిపప్పు, హెరిటేజ్ మజ్జిగ ప్యాకెట్లను అందరికీ ఇచ్చాడు. పవన్, జగన్‌లైతే ట్రైన్ ఢిల్లీకి వెళ్ళే వరకు కూడా ఒకరి భుజాలపై ఒకరు చేతులేసుకుని ఎంతో స్నేహంగా వుంటూ ఏపికి ప్రత్యేకహోదా మీదనే చర్చించుకోసాగారు. రైలు ఢిల్లీకి చేరింది. నాయకులు, కార్యకర్తలు అందరూ ప్రధాని కార్యాలయం ముందు నిరాహారదీక్షకు కూర్చున్నారు. చంద్రబాబు వుండి... మోడీ, ఇక్కడితో నీ వేషాలు ఆపు... మమ్మల్ని ప్యాకేజీతో మభ్య పెట్టాలని చూసావో ఖబడ్దార్... ఏపికి ప్రత్యేకహోదా ఇచ్చేవరకు ఇక్కడినుండి కదిలేది లేదు. నాలో జాలి, దయ ఎక్కువగా వుండబట్టి ఇప్పటిదాకా నీ జోలికి రాలేదు, నేను కేంద్రంలో చక్రం తిప్పడం మొదలుపెట్టానో నీ చక్రం ఆగిపోతుంది. అని హెచ్చరించాడు. తర్వాత జగన్, పవన్, ఉండవల్లి, జెపి, మధులు కూడా మాట్లాడి హోదా ఇవ్వకుంటే మిమ్మల్ని గోదాట్లో కలిపేస్తామని వార్నింగ్ ఇచ్చారు. వెంటనే అక్కడ కూర్చున్న కార్యకర్తలందరు కూడా "హోదా ఇవ్వాలి... హోదా ఇవ్వాలి" అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేయసాగారు.

ప్రత్యేకహోదా ఇవ్వడం కుదరదు. లెక్కలు చెప్పి ప్యాకేజీ తీసుకోండి. మీ చంద్రబాబు అవినీతి పరుడు. మేం ఇచ్చిన నిధులన్నింటిని జల్సా చేస్తున్నాడు. మీరెంత అరిచినా హోదా ఇవ్వను, హోదా ఇవ్వను... అని ప్రధాని నరేంద్రమోడీ కలవరించసాగాడు. రాజ్‌నాథ్‌సింగ్ వెంటనే టేబుల్ గ్లాస్‌లో వున్న నీళ్ళను మోడీ ముఖాన చల్లాడు. అప్పుడు మోడీ కళ్ళు తెరిచాడు. అప్పటిదాకా తనకు వచ్చింది కల అని తెలుసుకోవడానికి అతనికి పది నిముషాలు పట్టింది. మోడీ ఈ లోకంలోకి వచ్చి... ప్రత్యేకహోదా పోరాటానికి కలిసిరావాలని చంద్రబాబును జగన్ కోరాడని చెబితిరి... ఆ షాక్‌తో కళ్ళు తిరిగి పడిపోయాను. అప్పుడే ఏపి నేతలంతా కలిసి ఢిల్లీ వచ్చి పోరాడుతున్నట్లు కల వచ్చింది అని చెప్పాడు. అప్పుడు జైట్లీ... సార్, వాళ్ళలో అంత యూనిటీ వుంటే అసలు ఏపినే విడిపోయేది కాదు, భూమి ఆకాశాలు కలవవచ్చునేమో ఎంత నిజమో, ఏపి సమస్యల కోసం ఆ రాష్ట్ర నేతలు కలవరన్నది అంత నిజం. వీళ్ళు తమిళనాడు లాంటి డేంజర్స్ కాదు, మనం హాయిగా వుండొచ్చు అని చెప్పి లేచాడు.

---

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఉద్యోగులకు పని వత్తిడి, శ్రమ ఎక్కువగా ఉంటుంది. పనులందు టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. ఉద్యోగులు తమ అధికారులతో, సహచరులతో జాగ్రత్తగా మెలగండి. ఆరోగ్యం స్వల్ప ఇబ్బంది కలిగిస్తుంది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ఖర్చుల భారం పెరుగుతుంది. అయినా అవసరాలలో డబ్బు అందుతుంది. వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా సాగవు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఉద్యోగులకు అదనపు బాధ్యతలు, శ్రమ ఉంటుంది. పెద్దమొత్తాలలో లావాదేవీలను వాయిదా వేయండి. కొత్త పరిచయాలు బలపడతాయి. విద్యార్థులకు పరీక్షలు తృప్తి కలిగించగలవు. శుభకార్యములకై ప్రయత్నాలను ముమ్మరం చేస్తారు. ప్రయాణాలుంటాయి. ఆర్థిక పరిస్థితి బాగుండి ఆదాయము సంతృప్తికరము. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్థ, పునర్వసు 1, 2, 3పాదాలు

సభలు సమావేశాలలో ప్రముఖ బాధ్యతలు నిర్వహిస్తారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగి ఆదాయం పెరుగుతుంది. కొత్త పెట్టుబడులకు అవకాశాలు బాగుంటాయి. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు, కార్యసమర్థత బాగుంటుంది. ఆరోగ్యం బాగుంటుంది. కొత్త కాంట్రాక్టులు లభించగలవు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. బంధుమిత్రులకు సహాయపడతారు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

కుటుంబసభ్యులతో కొద్ది విభేదాలు చోటు చేసుకొంటాయి. ఉద్యోగులకు అధికారులతో సన్నిహితత్వం ఉంటుంది. దూర ప్రయాణాలుంటాయి. దిగువ ఉద్యోగులలో, వర్గాలలో పేచీలు రాకుండా జాగ్రత్త పడాలి. పరీక్షలను చక్కగా వ్రాస్తారు. ఆరోగ్యం ఫరవాలేదు. అనవసర విషయాలపై ఆందోళన చెందవద్దు. అనుకున్న పనులు సులువుగా జరుగుతాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత తక్కువ. కుటుంబసౌఖ్యముండును. వృత్తి, ఉద్యోగులకు రాబడి పెరుగుతుంది. బంధువులతో అభిప్రాయ భేదాలుంటాయి. పరీక్షలందు శ్రద్ధ చూపాలి విద్యార్థులు. పనుల వత్తిడి మరియు అనుకున్న పనులు సవ్యంగా జరగక టెన్షన్ పడుతుంటారు. వ్యాపారవృద్ధి సరిగా ఉండదు. ఆర్థికావకాశాలు చేజారిపోయే పరిస్థితులుంటాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఉద్యోగులకు కార్యసమర్థత గుర్తింపు గౌరవాలు, అధికారుల అభిమానం పొందుతారు. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత కలదు. కొత్త పరిచయాలు వ్యాపకాలు పెరుగుతాయి. ఆరోగ్యం బాగుంటుంది. ఆర్థిక స్థితి బాగుండి వ్యాపార వృద్ధి అవకాశాలు లభించి ఆదాయం పెరుగుతుంది. పెట్టుబడులు, షేర్లపై లాభాలుంటాయి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 23.2.2018 నుండి

తేది. 1.3.2018 వరకు

ఈ వారము వృషభ, మిధున, కర్కాటక, సింహ రాశులలో చంద్రుడు, కర్కాటకంలో రాహువు, తులలో గురువు, వృశ్చికంలో కుజుడు, ధనుస్సులో శని, మకరంలో కేతువు, కుంభంలో రవిబుధ శుక్రులు సంచరిస్తారు.

పంచాంగము

24తేది శనివారం ఉదయం 7.30 నుండి 9.0లోగా గృహారంభ వివాహములు. రాత్రి గంట 8.43 నుండి 10.50లోగా వివాహము.

1 తేది గురువారం ఉదయం గంట 7.30 నుండి 8.50 లోగా గృహారంభ వ్యాపార వివాహములు. రాత్రి గంట 8.20 నుండి గంట 10.30లోగా వివాహము.

ఫాల్గుణ మాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 23 | శుక్ర | అష్టమి | రా॥ గం.10.03వ॥ |
| తేది. 24 | శని | నవమి | రా॥ గం.7.54వ॥ |
| తేది. 25 | ఆది | దశమి | సా॥ గం.5.35వ॥ |
| తేది. 26 | సోమ | ఏకాదశి | సా॥ గం.3.13వ॥ |
| తేది. 27 | మంగళ | ద్వాదశి | ప॥ గం. 12.52వ॥ |
| తేది. 28 | బుధ | త్రయోదశి | ఉ॥ గం.10.33వ॥ |
| తేది. 1 | గురు | చతుర్దశి | ఉ॥ గం.8.26వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

బంధువర్గంతో విభేదాలు చోటు చేసుకుంటాయి. తొందరపాటు నిర్ణయాలు చేయవద్దు. మొగమాటాలకు వత్తిళ్ళకు లొంగవద్దు. ఉద్యోగులు తమ అధికారులతో పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. శుభకార్యాల నిర్ణయంలో అనుకూలత తక్కువ. అనుకోని ప్రయాణాలుంటాయి. ఆర్థిక ఇబ్బందులు స్వల్పంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలు ఆశించిన రీతిలో సాగవు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

శుభకార్యాలు నిర్ణయం కాగలవు. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేసికొనండి. ఉద్యోగులు విధి నిర్వహణలో జాగ్రత్త వహించండి. సమస్యలను పరిష్కరించుకొనే చొరవ చూపుతారు. పరీక్షలు వ్రాయడం బాగుంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు. చిన్న గాయాలు తగిలే అవకాశం ఉన్నది. అనుకున్న పనులు నిదానంగా జరిగి సానుకూలం కాగలవు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

విద్యార్థులకు మంచి సామర్థ్యముంటుంది. విదేశీ ప్రయాణాలకు అనుమతులు, ప్రభుత్వం నుండి ఆర్థిక అనుమతులు అందుతాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత, గృహోపకరణాలు కొత్తవి సమకూర్చుకొనడం, కుటుంబసౌఖ్యం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలు నిర్వహించే వారికి, కాంట్రాక్టర్లకు ఆర్థిక అవకాశాలు బాగుండి, ఆదాయం పెరుగుతుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

శుభకార్యాలు నిర్ణయం కాగలవు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. సాంఘిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. బంధువర్గం నుండి శుభవార్తలు వింటారు. కోర్టు కేసులందు అనుకూలత కలదు. పరీక్షలను విద్యార్థులు బాగా వ్రాస్తారు. వృత్తి ఉపాధి పథకాలలో నిలద్రొక్కుకొని, ఆదాయం పెంచుకొంటారు. అనుకొన్న పనులకు ఆటంకాలు కలుగుతుంటాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు

కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది. విలువైన వస్తువులు సమకూర్చుకొంటారు. ఉద్యోగుల బాధ్యతలు, కార్యక్రమాలు ప్రశాంతంగా సాగుతాయి. తరచూ ప్రయాణాలుండగలవు. బంధువర్గం నుండి అనారోగ్య వార్తలు వింటారు. సోదర వర్గానికి మేలు జరుగుతుంది. ఆరోగ్యం ఫరవాలేదు. చేపట్టిన పనులను పట్టుదలతో సానుకూలం చేసికొనగలరు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగి, ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగులకు అధికారుల ఆదరణ, స్థాన మార్పులుండవచ్చును. తరచూ ప్రయాణాలుంటాయి. ఉద్యోగార్థులకు మంచి అవకాశాలుంటాయి. కుటుంబ సౌఖ్యం, ఆరోగ్యం బాగుంటుంది. వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు.



## పూలే ఆశయ సాధనలో...
# అహరహం శ్రమిస్తున్న 'ఆరంబాకం'

ఆయన పేరు.. ఆరంబాకం చంద్రశేఖర్. తల్లి పేరు కస్తూరి. తండ్రి ప్రఖ్యాత తంజావూరు చిత్రకారుడు రాజసింహ. వృత్తి ప్రభుత్వోద్యోగమే అయినా ప్రవృత్తి మాత్రం సామాజిక సేవ. బడుగు బలహీన వర్గాల వారికి తనవంతు సేవ చేయాలన్నదే ఆయన తపన. అందులోనూ మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని జీవితం కొనసాగిస్తూ, అలాంటి మహానుభావుల విగ్రహాలను అందరికీ స్ఫూర్తినిచ్చేలా నెల్లూరు నగరంలో నెలకొల్పి ఆ ఆదర్శమూర్తుల పేరుతో ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తూ అందరి ప్రశంసలందుకుంటున్నారాయన. ఈ ఆశయాలన్నీ ఆయనకు తన తండ్రిగారైన రాజసింహ నుంచే వచ్చాయి. ఆధునిక భారతదేశంలో 19వ శతాబ్దిలో తొలి సామాజిక సంస్కర్త జ్యోతిరావుపూలే. అణగారిన.. బడుగు బలహీనవర్గాల ప్రజలకు ఆత్మబంధువుగా నిరుపమానమైన సేవలందించి, దేశంలో తొలి 'మహాత్మా' బిరుదుతో ప్రఖ్యాతమైన మహాత్మా జ్యోతిరావు పూలేని ఆదర్శంగా తీసుకుని గత నలభై ఏళ్ళుగా దివంగత రాజసింహ ఆధ్వర్యంలో నెల్లూరులో అనేక కార్యక్రమాలు జరిగాయి. జ్యోతిరావుపూలే జయంతి, వర్ధంతి కార్యక్రమాలన్నీ ఆయన నేతృత్వంలోనే నిర్వహిస్తుండేవారు. అదే విధంగా జ్యోతిరావు పూలే సతీమణి సావిత్రిబాయి పూలే కూడా ఆదర్శ మహిళ. దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయిని. ఆమె మంచి కవయిత్రి కూడా. తొలుత ఆమెకు చదువు లేకపోయినా, జ్యోతిరావు పూలే ఆమెను చదివించి ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దారు. ఆడపిల్లలకు చదువు వద్దు అనుకునే ఆ రోజుల్లో సావిత్రిబాయి పూలే తాను చదువుకుని పదిమందికీ చదువు చెప్పారు. అలాంటి ఆదర్శమూర్తుల విగ్రహాలను నెల్లూరు నగరంలో నెలకొల్పి అందరికీ వారి ఆదర్శాలను తెలియజెప్పడం కంటే మంచి కార్యం ఏముంటుందీ!.. తండ్రి తర్వాత ఆ సామాజిక సేవా కార్యక్రమాలను తనయుడు అందిపుచ్చుకున్నారు. పదేళ్ళ క్రితం నెల్లూరులోని మినీబైపాస్‌రోడ్‌లో మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహాన్ని నెలకొల్పేందుకు ఆరంబాకం చంద్రశేఖర్ ఎంతగానో శ్రమించారు. ఆ తర్వాత ప్రముఖదాత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి వదాన్యతతో మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహం చెంతనే ఆయన సతీమణి సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని కూడా నెలకొల్పారు. ఇలా రెండు విగ్రహాలను ఒకే ఐలాండ్‌లో కలిపి ఏర్పాటుచేయడం ఎంతైనా విశేషం. ఎంతోకాలం కృషి చేసి జిల్లా అధికారులు, వదాన్యుల సహకారంతో, మిత్రులు సహచరుల సహాయంతో జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను నెలకొల్పి ఆరంబాకం చంద్రశేఖర్ తన జీవితాన్ని సార్ధకం చేసుకున్నారు. అంతేకాదు, ఆ మహనీయుల ఆదర్శాలను ప్రజలకు మరింతగా తెలియజెప్పే కార్యక్రమాలెన్నో చేస్తూ నేటికీ అందరికీ మార్గదర్శకంగా ఉన్నారు.



వివిఎస్‌యు వి.సి వీరయ్య నుండి సత్కారాన్నందుకుంటున్న ఆరంబాకం చంద్రశేఖర్



ప్రముఖ దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దాతృత్వంతో జ్యోతిరావ్ పూలే విగ్రహం పక్కన ఏర్పాటు చేసిన సావిత్రిబాయి పూలే విగ్రహం (ఫైల్‌ఫోటో)

కేవలం విగ్రహాలను ఏర్పాటు చేయడమేకాక, ఆ విగ్రహాలను క్రమబద్ధంగా శుద్ధజలాలతో పరిశుభ్రం చేయడం, లైటింగ్ ఏర్పాటు చేయడం వగైరా పనులన్నీ కూడా ఆయన చేస్తుంటారు. నేటితరం వారికి ఆ మహనీయుల ఆదర్శాలను తెలియజేస్తూ నేటికీ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా, వివిధ రంగాల్లో సమాజానికి విశిష్టసేవలు అందిస్తున్నవారికి ప్రోత్సాహకంగా మహాత్మాజ్యోతిరావు పూలే-సావిత్రిబాయి పూలే అవార్డులను కూడా ఆయన ఏటా బహుకరిస్తున్నారు. తొలి నుంచి నటరత్న డా. నందమూరి తారకరామారావు అభిమాని ఆయన. విద్యార్థి దశ నుంచి కూడా సమాజానికి తనవంతు సేవ చేయాలనే భావం ఉండేది. అందువల్లనే అనేకరంగాల్లో, అనేక సంఘాల్లో ఆయన పేరు మారుమ్రోగుతూ ఉంటుంది. పదేళ్ళ క్రితం బిసి జనగణన సర్వేకై జిల్లావ్యాప్తంగా 46 మండలాల్లోనూ రథయాత్ర చేసి ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. బిసి ఉద్యోగుల సంక్షేమసంఘానికి రాష్ట్ర అధ్యక్షునిగా నేటికీ నిరుపమాన సేవలందిస్తూనే ఉన్నారు. ఏపీ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షునిగా, రాష్ట్ర మత్స్యకారుల సంఘానికి రాష్ట్రాధ్యక్షునిగా.. ఇలా అనేకసంఘాలకు తన సేవలందిస్తున్నారు. అన్నిటికీ మించి వినయం, వినమ్రత అయన నైజం. ఎంతో ఓర్పుతో, వినయంతో ఉంటూ, అందరి అధికారుల మన్ననలు అందుకుంటూ.. వారందరి సహకారంతోనే ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను ఆయన అలుపెరుగక నిర్వర్తిస్తున్నారు.

ఇటీవల గూడూరులోని ఆదిశంకర కళాశాలలో సావిత్రిబాయి పూలే 188వ జయంతిని పురస్కరించుకుని సమాజానికి విశిష్టసేవలందిస్తున్న పలువురు మహిళలకు అద్వితీయమైన రీతిలో సావిత్రిబాయిపూలే జాతీయ ప్రతిభాఅవార్డులను ప్రదానం చేసి, సామాజిక సేవ పట్ల తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. జ్యోతిరావు పూలే ఫౌండేషన్ కార్యదర్శిగా, దక్షిణభారత దేశంలోని మూడు రాష్ట్రాలకు చెందిన పలువురు విశిష్టవ్యక్తులకు ఆయన ఆధ్వర్యంలో ఈ అవార్డులను బహుకరించి అందరి ప్రశంసలందుకున్నారు.

**మహనీయుడు అబ్దుల్‌కలాం విగ్రహస్థాపనకు కృషి :**

దేశానికే గర్వకారణమైన శాస్త్రవేత్త, మహనీయుడు, మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్‌కలాం విగ్రహాన్ని నెల్లూరు నగరంలో ప్రతిష్టించేందుకు కృషిచేస్తున్నట్లు ఆరంబాకం చంద్రశేఖర్ ఈ సందర్భంగా తెలిపారు. ఆ మేరకు 9 అడుగుల కాంశ్యవిగ్రహాన్ని రూపొందించేందుకు ప్రపంచ ప్రఖ్యాతశిల్పి డా.వడయార్‌ను సంప్రదించివున్నామని, స్థలం అనుమతి కోసం ప్రయత్నిస్తున్నామని, ప్రభుత్వ అధికారుల సూచనలు, సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించాలని భావిస్తున్నామన్నారు. అదేవిధంగా భవిష్యత్తులో ఆదర్శమూర్తి, ప్రపంచ ప్రఖ్యాతిచెందిన సేవామూర్తి మదర్ థెరిస్సా విగ్రహాన్ని కూడా ప్రతిష్టించాలనే సంకల్పం ఉందన్నారు. పేద ప్రజలకు ఎనలేని సేవలందించిన ఎస్‌ఆర్ శంకరన్ విగ్రహాన్ని కూడా ఏర్పాటుచేయాలనే ఆలోచన ఉందన్నారు.



సావిత్రిబాయి పూలే జాతీయ ప్రతిభా అవార్డులందుకున్న మహిళామణులు

# కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన జేసీ



జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ ఈ నెల 21వ తేదీన ఇందుకూరుపేట మండలం కొత్తూరులో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం కోవూరులోని శాంతినగర్ నందు ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని కూడా ఆయన తనిఖీ చేశారు.

# డిగ్రీలో బిజిఆర్ విద్యార్థినుల ప్రతిభ



విక్రమ సింహపురి యూనివర్సిటి డిగ్రీ ఫలితాల్లో బెజవాడ గోపాలరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు 91శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ జె.వి.రెడ్డి తెలిపారు. నెల్లూరు దర్గామిట్టలోని కళాశాలలో ఈ నెల 21న ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను ఆయన అభినందించారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ మృదుల మాట్లాడుతూ తమ కళాశాలలోని అధ్యాపకులు అంకితభావంతో పని చేయడం ద్వారా ఇది సాధించగలిగామన్నారు. మొదటి సెమిస్టర్ బిఎస్సీ విభాగంలో ఎస్.కె. సుమయా తబసుం 99శాతం, ఎస్.కె.మంజూర్ 98శాతం, సి.అంజలి పటేల్ 95 శాతం, బి.సాయినవ్య 93శాతం, వి.శార్వాణి 91శాతం, బికాంలో యం.నిరీష 92శాతం మార్కులు సాధిం చారన్నారు. ఐదవ సెమిస్టర్ బిఎస్సీలో జి.అనూహ్య 97శాతం, డి.గీతాంజలి 96 శాతం, పి.సుభాషిణి 96శాతం, వి.లిఖిత 96శాతం, బికాంలో కె.శృతి 92శాతం మార్కులు, తృతీయ సెమిస్టర్ బిఎస్సీలో వి.వెంకటవైష్ణవి 95శాతం, ఎస్.కె.మెహ తాజ్ 92శాతం, టి.దివ్యకళా 92శాతం, బి.కాంలో ఎస్.కె.సిమ్రాన్ 94శాతం మార్కులు సాధించారని తెలిపారు.



# నగర వైసిపి అధ్యక్షురాలుగా శోభారాణి

నెల్లూరు నగర వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలుగా నెల్లూరు 29వ డివిజన్‌లోని నిప్పో హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన తోట శోభారాణిని నియమిస్తూ పార్టీ అధ్యక్షులు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. శోభారాణి గత కొన్నేళ్ళుగా పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ఇంకా శ్రమించి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా శోభారాణి పేర్కొంటూ, తనకు ఈ పదవి రావడానికి కారణమైన వై.యస్.జగన్‌కు, సజ్జల రామకృష్ణారెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, తాటి వెంకటేశ్వర్లు, మొయిళ్ళ గౌరీకి కృతజ్ఞతలు తెలిపారు.

# అవధాన విద్య తెలుగుభాషకే సొంతం

విడవలూరులోని పిఆర్‌ఆర్ అండ్ విఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ గిరి అధ్యక్షతన ఇటీవల 'అవధాన ప్రక్రియ' అనే అంశంపై పలువురు అవధానులు పాల్గొని అవధానం విశిష్టతను విద్యార్థులకు వివరించారు. వెంకటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల సంస్కృత అధ్యాపకులు అష్టావధాని మైలవరపు మురళీకృష్ణ మాట్లాడుతూ అవధాన విద్య విజ్ఞానంతో పాటు, మానసిక ఉత్సాహాన్ని, ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందన్నారు. అల్లూరు రామకృష్ణా జూనియర్ కళాశాల విశ్రాంత సంస్కృతోపన్యాసకులు అవధాని కోట రాజశేఖర్ మాట్లాడుతూ ఎందరో పండితులు తెలుగు సాహిత్యాన్ని పండించారని, ఎన్నో అద్భుతమైన రచనలు చేసి తెలుగుభాషకు వన్నె తెచ్చారన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు అవధాన విద్యలో బాగా రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం అవధానులైన కోట రాజశేఖర్‌ను, మైలవరపు మురళీకృష్ణ, విశ్రాంత తెలుగు పండితుడు కంది శంకరయ్య(హైదరాబాద్)లను కళాశాల నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రమణారావు, అధ్యాపకులు చక్రపాణి, జాన్‌పాల్, విజయమహేష్ తదితరులతో పాటు జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి పెద్దసంఖ్యలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కోట రాజశేఖర్‌ను సత్కరిస్తున్న కళాశాల నిర్వాహకులు

# పోలీసు కుటుంబాలకు చెక్కులు అందజేత



బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న ఆర్.ఐ చంద్రమోహన్

విధి నిర్వహాణలో మృతి చెందిన పోలీసు కుటుంబాలకు పోలీసు అధికారుల సంఘం చేయూతనిచ్చింది. నెల్లూరుజిల్లా దక్కిలి పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ మేషక్, బిట్రగుంట కానిస్టేబుల్ యేబు విధి నిర్వహణలో కొంత కాలం క్రితం మృతి చెందారు. వీరి కుటుంబసభ్యులకు ఈ నెల 20న రూ.50వేలు చొప్పున హుమానిటి కార్ఫస్‌ఫండ్ కింద చెక్కులను వెల్ఫేర్ ఆర్‌ఐ చంద్రమోహన్, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు మద్దిపాటి ప్రసాదరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి తురకా శ్రీనివాసులు అందజేశారు.

## 25 నుండి రంగడి బ్రహ్మోత్సవాలు



నెల్లూరు రంగనాయకులపేటలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 25వ తేదీ నుంచి మార్చి 8వతేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈమేరకు ఈ నెల 20న దేవస్థానం ప్రాంగణంలో ఆలయ ఛైర్మెన్ మంచికంటి సుధాకర్‌రావు, ఇ.ఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికలు, గోడ పత్రికలను ఆవిష్కరించారు. మార్చి 2న గరుడసేవ, 3న కళ్యాణం, 4న రథోత్సవం, 8వ తేదీ తెప్పోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.

# కమనీయం 'శ్రీవారి' కల్యాణోత్సవం



నెల్లూరు శ్రీహరినగర్‌లో శ్రీవారి నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస కళ్యాణ మహోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. తిరుమల అర్చకులు మాధవగిరి లక్ష్మీనరసింహమూర్తి, నారాయణ విష్ణువర్ధన్ అర్చక బృందం ఆధ్వర్యంలో తిరుమల నుంచి తీసుకొచ్చిన దేవదేవేరుల విగ్రహాలను విశేషంగా అలంకరించి పుష్పయాగం, కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రముఖ నాదస్వర విద్వాంసులు పి.శ్రీనివాసులు(అల్లూరు) నాదస్వర కచ్చేరి, ప్రముఖ గాయని గురుకృప సంగీత విద్యాలయం అధినేత్రి లక్ష్మీప్రసన్న బృందం ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు, కోలాటాలు, పండరీ భజనలు భక్తులను అలరించాయి. అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమం జరిగింది. రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ సి.శ్రీనివాసరాజు, డి.ధనుంజయ, ఉపాధ్యక్షుడు డి.ప్రసాద్, సహాయ కార్యదర్శి జి.రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# బాబు టెంపరరీ

(మొదటి పేజీ తరువాయి)

మనం సొంతంగా ఒక ఇంటిని కట్టుకుంటున్నాం... దాని వెనుక ఎంతటి ప్రణాళిక ఉంటుంది. ఎన్ని ఆలోచనలుంటాయి. ఆ ఇల్లు ఎన్నో తరాలకు ఉపయోగపడాలనుకుంటాం... ఎన్నేళ్లో పటిష్టంగా వుండాలనుకుంటాం... ఆ ఇంటి గురించి ఎంతో దూరదృష్టితో ఆలోచిస్తాం... అందు కోసం వాడే ప్రతి పైసాను ఎంతో జాగ్రత్తగా ఖర్చుపెడతాం. ఒక ఇంటి విషయంలోనే మనం భవిష్యత్ తరాల గురించి, డబ్బు ఖర్చు గురించి ఇంతగా ఆలోచిస్తే మరి ఒక రాజధాని నిర్మాణం విషయంలో, రాబోయే తరాలకు ఉపయోగపడే భవనాల విషయంలో ఈ ముఖ్యమంత్రి ఎంత దూరదృష్టితో ఆలోచించాలి. ఎంత పక్కా ప్రణాళికతో వ్యవహరించాలి.

అమరావతి రాజధాని విషయంలో చంద్రబాబుకు ఒక వ్యూహం, ఒక ఆలోచన, ఒక క్లారిటీ అన్నది లేకుండాపోయింది. సింగపూర్ లాంటిది కడతాడా? టోక్యో లాంటిది కడతాడా? బీజింగ్ వంటిది కట్టాలనుకుంటున్నాడా? దావోస్ లాంటిదేమన్నా ప్లాన్ చేస్తున్నాడా? ఇంతవరకు ఆయనకే స్పష్టత లేదు. ఏ దేశానికి పోతే ఆ దేశం పేరు ఎత్తుతాడు. ఏ నగరంలో వుంటే అమరావతిని ఆ నగరంలానే నిర్మిస్తామంటాడు.

నాలుగేళ్ళుగా అలాంటి రాజధాని, ఇలాంటి రాజధాని అంటూ డబ్బా కొట్టుకోవడం తప్పించి వాస్తవానికి అక్కడ పొడిచిందేమీ లేదు. చంద్రబాబు టెంపరరీ ఆలోచనలకు తగ్గట్లే టెంపరరీ భవనాలు... అసెంబ్లీ చూస్తే టెంపరరీ... సచివాలయం చూస్తే తాత్కాలికం... ఆఖరుకు హైకోర్టు కూడా టెంపరరీనే నట... ఈ తాత్కాలిక భవనాల నిర్మాణానికే వేలకోట్లు తగలేస్తున్నారు. చదరపు అడుగు 8వేల రూపాయల కాంట్రాక్ట్‌తో(రికార్డ్ రేటు) కట్టిస్తున్నారు. టెంపరరీ భవనాలకు ఇన్ని కోట్లు తగలేసే బదులు ఆ నిధులతోనే శాశ్వత భవనాలు కట్టొచ్చు కదా? వందలు, వేల కోట్లు పెట్టి టెంపరరీ భవనాలు కట్టేబదులు పక్కా ప్లానింగ్‌తో తెలుగుతనం ఉట్టిపడే డిజైన్‌లతో శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టి అవి పూర్తయ్యే వరకు తాత్కాలికంగా మూతపడే స్థితిలో వున్న ఇంజనీరింగ్, ఇతర కాలేజీ భవనాలను అద్దెకు తీసుకుని పరిపాలన సాగించవచ్చు కదా?

అసలు పదేళ్ళు ఉమ్మడి రాజధానిని వదిలి అమరావతికి పారిపోయి రావలసిన అవసరమేమొచ్చింది...? తాను వేసిన తప్పటడుగుని కప్పిపుచ్చుకోవడానికి నవ్యాంధ్రకు పారిపోయి వచ్చి, కేంద్రం ఇచ్చిన చిల్లర ప్యాకేజీలను మొత్తం టెంపరరీ కట్టడాలపైన ధారపోసేశాడు. కనీసం రెండేళ్ళైనా హైదరాబాదులోనే వుండి వుంటే ఆ రెండేళ్ళలో అద్భుతమైన శాశ్వత భవనాలు నిర్మించుకుని వుండొచ్చు. ఇలా వందల కోట్లు దుబారా చేసే ఖర్మ పట్టి వుండేది కాదు. తాను చేసిన ఒక్క తప్పును కప్పిపుచ్చుకోవడానికి ఇప్పుడు తప్పు మీద తప్పు చేసుకుంటూ పోతున్నాడు.

బాబు అనుభవశాలి అంటూ ఆయనను నెత్తికెక్కించుకున్న నవ్యాంధ్ర ప్రజలు ఆయన చేస్తున్న టెంపరరీ పనులు తుంటరి పనులు చూసి అయ్యో ఈ అనుభవశాలిని అందలమెక్కించి మనం అనుభవిస్తున్నామే అని వాపోయ్యే పరిస్థితి ఏర్పడింది.

ఈ నాలుగేళ్ళ పాలనలో చంద్రబాబు ఏమి చేసినా టెంపరరీయే. ఏది చేపట్టినా టెంపరరీనే! చివరకు ఆయన సీఎం పదవి కూడా టెంపరరీనే అవుతుందేమో... చూద్దాం!

# ప్రసన్నకుమార్‌కు 'యోగ కలైమామణి' అవార్డు



నాన్నమ్మాళ్ నుండి అవార్డునందుకుంటున్న ప్రసన్న

నెల్లూరుకు చెందిన ప్రముఖ యోగ మాస్టర్ ప్రసన్నకుమార్ ఎంతో విశిష్టమైన 'యోగ కలైమామణి' అవార్డును సాధించారు. ఈనెల 18న చెన్నైలోని బోధి క్యాంపస్‌లో సౌత్‌జోన్ యోగ చాంఫియన్‌షిప్ పోటీలు నిర్వహించిన సందర్భాన్ని పురస్కరించుకుని యోగలో రెండు దశాబ్దాల పాటు అనుభవం ఉన్న యోగ గురువులకు అవార్డులను ప్రదానం చేశారు. నెల్లూరు భక్తవత్సల నగర్‌కు చెందిన సీనియర్ యోగ మాస్టర్ ప్రసన్నకు ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రఖ్యాత యోగ గురువు నాన్నమ్మాళ్ చేతుల మీదుగా ఈ అవార్డును అందజేశారు. ఇలాంటి విశిష్టమైన అవార్డులను నెల్లూరు యోగమాస్టర్, జిల్లా యోగ క్రీడా అసోసియేషన్ కార్యదర్శి ప్రసన్న అందుకోవడం తమకెంతో సంతోషకరమని అసోసియేషన్ అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ స్వప్న, రమణారెడ్డి, కోశాధికారి చంద్రమల్‌రెడ్డి తదితరులు పేర్కొన్నారు.

# ప్రశాంతంగా పోలీస్ ఎన్నికలు

పోలీసు ఉద్యోగుల సహకార పరపతి సంఘం ఎన్నికలు ఈనెల 18వతేదీన నెల్లూరు పోలీసుగ్రౌండ్‌లోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ఉత్కంఠభరితంగా జరిగాయి. పోలీసు అధికారుల సంఘం గౌరవాధ్యక్షులు శ్రీహరి ప్యానెల్, అలాగే సంఘం అధ్యక్షులు ఎం.ప్రసాద్‌రావు ప్యానెల్ నుండి అభ్యర్థులు రంగంలోకి దిగారు. అలాగే పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జె.శ్రీనివాసరావు తరఫున మరో ముగ్గురు అభ్యర్థులు పోటీలోకి దిగారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల దాకా జరిగిన పోలింగ్‌లో 2374 ఓట్లకు గాను 1590ఓట్లు పోలయ్యాయి. మొత్తం 10డైరక్టర్ల స్థానాలకు 23మంది పోటీ పడగా శ్రీహరి ప్యానెల్‌కు 5డైరక్టర్ పదవులు, ప్రసాదరావు ప్యానెల్‌కు 5 డైరక్టర్ పదవులు దక్కాయి. జె.శ్రీనివాసరావు ప్యానెల్ నుండి ఒక్కరూ గెలవలేదు. కాగా, రెండు ప్యానెల్స్ వారు సమానంగా డైరెక్టర్ల పదవులను గెలవడంతో రెండు ప్యానెల్స్ మధ్య రాజీ కుదిర్చి ప్రసాద్ ప్యానెల్ నుండి గెలిచిన ఆత్మకూరు మాల్యాద్రిని కార్యదర్శిగా, శ్రీహరి ప్యానెల్ నుండి గెలిచిన కె.జాన్‌ను కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# ఇక ఉధృతం

(మొదటి పేజీ తరువాయి)

అరుణ్‌జైట్లీ ఏపికి ప్రత్యేకహోదా కాదు, ప్రత్యేక ప్యాకేజీ అని ప్రకటించినప్పుడు చప్పట్లు కొట్టి స్వాగతించిన చంద్రబాబు, రాష్ట్ర ప్రజల దృష్టిలో విలన్‌గా మిగిలాడు. ప్రత్యేకహోదా కంటే ప్రత్యేక ప్యాకేజీయే మేలంటూ ఏపి యువత భవితను చిత్తు చేయడంలో కేంద్రానికి ఆయన ఆ విధంగా సహకరించాడు. ఏపికి ప్రత్యేకహోదా విషయంలో చంద్రబాబు నాలుక మడతపెట్టినా, దీని కోసం రాష్ట్రంలో మొదటి నుండి పోరాడుతున్నది వైకాపా అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డే! ప్రత్యేకహోదా కోసం నిరాహారదీక్ష చేయడమే కాదు, రాష్ట్ర వ్యాప్తంగా సభలు నిర్వహించాడు. మధ్యలో పవన్ కళ్యాణ్ ప్రత్యేక హోదాపై సభలు పెట్టినా అది చంద్రబాబు డైరక్షన్‌లో జరిగినవేనని అర్థమైపోయింది.

ఇక ఏడాదిలో ఎన్నికలున్నాయి. ఎన్డీఏ తన చివరి బడ్జెట్‌లో కూడా ఏపిని చిన్నచూపు చూసింది. ప్రత్యేకహోదాకు పూర్తిగా సమాధి కట్టింది. ఈ దశలోనే జగన్ ప్రత్యేకహోదా ఉద్యమానికి ఊపిరిలూదాడు. ప్రత్యేకహోదా పోరాటాన్ని ట్రాక్ ఎక్కించాడు. గల్లీ నుండీ ఢిల్లీ దాకా పోరాట ప్రణాళికను రచించాడు. తమ పార్టీ ఎంపీల రాజీనామా దగ్గర్నుండి ఎన్డీఏ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం దాకా ఎటువంటి పోరాటానికైనా వెనక్కు తగ్గేది లేదని ప్రకటించాడు. అంతేకాదు, ఇంకో అడుగు ముందుకేసి ప్రత్యేకహోదా కోసం చంద్రబాబు, పవన్‌లతో సహా ఎవరితోనైనా కలిసి పని చేసేందుకు సిద్ధమని ప్రకటించాడు. "మైనే జో వాదా కియా... ఓ నిభానా పడేగా(నేను ఏ మాట చెప్పానో... ఆ మాట నిలబెట్టుకుని తీరాలి)" అని ఓ హిందీ చిత్రంలో మాటను గుర్తుకు తెచ్చేలా హోదా కోసం తాను చేసిన వాదాని తూ.చా తప్పకుండా నిలబెట్టుకునేలా తన పోరాటాన్ని ముందుకు సాగిస్తున్నాడు.

రాష్ట్రంలో ప్రత్యేకహోదా ఉద్యమం జగన్ పిలుపుతోనే వేడెక్కింది. వామ పక్షాలు, మేధావులు, ప్రజాసంఘాలు సైతం జగన్ ఉద్యమ పంథాను హర్షిస్తూ ఆయనకు మద్దతుగా నిలుస్తున్నాయి. ఇంకోపక్క చంద్రబాబు పార్టనర్‌గా పిలవబడే పవన్ కళ్యాణ్ సైతం జగన్ పంథాను అభినందిస్తూ, ఈ పోరాటంలో ఆయనకు మద్దతు నిస్తామని ప్రకటించారు.

రాష్ట్రంలో పార్టీలు, ప్రజలు, ప్రజా సంఘాలు ప్రత్యేకహోదాకై పోరాటం బాటపట్టినా... చంద్రబాబు మాత్రం ఇంకా పిల్లిమొగ్గలు వేస్తూనే వున్నాడు. అవిశ్వాసం ద్వారా కేంద్రం మెడలు వంచలేమంటూ తన అనాశక్తతను బయటపెట్టాడు. మరి అవిశ్వాసానికి ముందుకు రాడు... ఆయన మంత్రులు కేంద్రం నుండి బయటకు రారు... మరి ఎంపీలు పార్లమెంటు ఎదుట చిల్లర వేషాలు వేస్తే ప్రత్యేకహోదా వస్తుందా? కేంద్రం దిగి వస్తుందా?

ప్రత్యేకహోదా పోరులో జగన్ దూకుడు పెంచాడు. ఆయన పోరాటంలో చిత్తశుద్ధి కనిపిస్తుంది. పవన్‌తో సహా ఇతరులెవరూ జగన్ పోరును వేలెత్తి చూపలేరు. కేంద్రంపై పోరాడలేక గుటకలు మింగుతున్న చంద్రబాబును ఏపికి మరో విలన్‌లా అందరూ చూస్తున్నారు...!

# విపిఆర్ ఖరార్

(మొదటి పేజీ తరువాయి)

అయినా కూడా ఇప్పుడున్న పరిస్థితుల్లో వైసిపి నుండి ఇక ఎమ్మెల్యేలెవరూ జారుకునే వాతావరణం లేదు. గట్టిగా ఇంకో ఏడాదిలో ఎన్నికలున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేకత, జగన్ పట్ల ఆదరణ స్పష్టంగా కనిపిస్తోంది. అదీగాక చంద్రబాబు ఆశించినట్లు రాష్ట్రంలో సీట్లు పెరగలేదు. ఇప్పటికే వైసిపి నుండి తెలుగుదేశంలో చేరిన చాలామందికి టిక్కెట్లు సందేహంగానే వున్నాయి. కాబట్టి ఎవరూ ఇక పార్టీ మారే పరిస్థితి రాదు, కాబట్టి రాజ్యసభ సభ్యుడిగా విపిఆర్ విజయానికి తిరుగుండకపోవచ్చు.

ఇక తెలుగుదేశంకు దక్కే రెండు రాజ్యసభ స్థానాలకుగాను నెల్లూరుజిల్లా నుండి బీద మస్తాన్‌రావు పేరు కూడా వినిపిస్తోంది. 2014 ఎన్నికల్లో కావలి నుండి ఓడిపోయిన మస్తాన్‌రావు కావలి ఇన్‌ఛార్జ్‌గాను, రాజధాని కమిటి సభ్యులుగానూ ఉన్నారు. 2004-2014ల మధ్య పార్టీ ప్రతిపక్షంలో వున్నప్పుడు పార్టీ కోసం ఆర్థికంగా ఎంతో పని చేసాడు. పార్టీ పట్ల, చంద్రబాబు నాయకత్వం పట్ల విధేయత చూపాడు. గత ఏడాదికాలంగా ఆయన పేరు టీటీడీ ఛైర్మెన్‌గా కూడా ప్రచారంలోకి వచ్చింది. అయితే ఆయన మాత్రం చాలారోజుల నుండి రాజ్యసభ పైనే ఆశలు పెట్టుకుని వున్నాడు. బీసీల కోటాలో బీఎంఆర్‌కే రాజ్యసభ అవకాశాలున్నట్లుగా తెలుస్తోంది.

### పంజాబ్ నేషనల్ బ్యాంక్ పచ్చిమోసం వెనుక

# అవినీతిదే ప్రముఖపాత్ర!



చిన్ని శ్రావణ్‌కుమార్
చార్టర్డ్ అకౌంటెంట్

***ఇంటి దొంగను ఈశ్వరుడు కూడా పట్టుకో లేడనటానికి పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో జరిగిన దారుణమైన ఉదంతమే ఉదాహరణ.***

కంప్యూటరీకరణతో తరిస్తున్న బ్యాంకుల్లో సైతం మోసాలు విరివిగా జరుగుతుండడం ఆశ్చర్యకరంగా పరిణమిస్తుంది. రోజు లావాదేవీలను తనిఖీ చేసే ఆడిటర్లు, నెలల తరబడి తనిఖీ చేసే బ్యాంకుల అంతర విభాగ బృందాలు, రిజర్వ్‌బ్యాంక్ నిఘా వ్యవస్థ, మళ్ళీ సంవత్సరానికొకసారి చట్టబద్ధమైన ఆడిట్ విభాగాన్ని దాటుకొని కోర్ బ్యాంకింగ్ కళ్ళు గప్పి ఇలాంటి మోసాల వైపరీత్యాలు జరుగుతున్నాయంటే కేవలం బ్యాంకు అధికార్ల ప్రలోభాలకు లొంగడమే అసలైన కారణం.

ఎన్ని నిఘా నేత్రాలు తెరచినా ప్రజల సొమ్మును అప్పనంగా ఆరగించే వాళ్ళకు ఋణాలివ్వడం వెనుక బ్యాంక్ అధికార్ల బలహీనతలే కారణం అంటే నివ్వెరపోకతప్పదు. లేకుంటే 2700 కోట్లు ప్రజలసొమ్ము వృథా చేసిన బ్యాంకింగ్ అధికారులను ఏ విధంగా శిక్షించాలో చట్టాలకు తెలియకపోవచ్చు. కాని అంత సొమ్మును ఆరగించి తప్పించుకొని వెళ్ళగల్గడం మాత్రం ఒక నీరవ్‌మోడీ, మరో కొఠారీ, విజయమాల్యాలకు మాత్రం బాగా తెలుసు. వ్యాపారవర్గాలకు బ్యాంకులు ధన రూపేణ గానీ, హామీ రూపంలో (ధనేతరంగా) గాని ఋణం ఇవ్వడం జరుగుతుంది. ఇంతవరకు ధనేతర రూపేణా ఇచ్చిన ఋణాల్లో ఎక్కడా మోసం జరిగినట్టు మనం వినలేదు. అలా ఇచ్చిన హామీ ఋణాల్లో తొలిసారిగా పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో జరగడం రికార్డుగా పేర్కొనవచ్చు.


విదేశీ విఫణిని సాగించే నీరవ్‌మోదీ వజ్రాల దిగుమతి కోసం పంజాబ్ నేషనల్ బ్యాంక్ ద్వారా 280కోట్ల హామీలను విదేశీ వ్యాపారులకు అందించడం అవి చెల్లించలేకపోవడంతో హామీ ఇచ్చిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ చెల్లించాల్సిన అగత్యం ఏర్పడింది. ఇక్కడ వడ్డీ శాతం కేవలం నాలుగు మాత్రమే కావడం అలా వేసుకొన్న వడ్డీతో సహా మొత్తం ఇప్పటి వరకు 2700 కోట్ల స్కాం అంటే ప్రజల గుండెల్లో రైళ్ళు పరుగెడ్తున్నాయి. 2011 నుండి పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఖాతాదారుడుగా ఉన్న నీరవ్ మోదీ తాను ఇచ్చిన సెక్యూరిటీ ఆస్తుల కంటే అత్యధికంగా హామీ ఋణాల్ని పొందడం వెనుక బ్యాంకు అధికార్ల అవినీతే కారణమవుతుంది.

చిన్నచిన్న ఋణాల కోసం బ్యాంకులకు వెళ్ళిన సామాన్యుడి వద్ద నూరుశాతం లేక రెండు వందల శాతం సెక్యూరిటీని గుంజే బ్యాంకింగ్ సంస్థలు ఏకబిగిన అత్యంత తక్కువ మొత్తం సెక్యూరిటీతో నీరవ్ మోదీ లాంటి వ్యక్తులకు వందలకోట్లకు హామీలివ్వడమంటే ప్రజల సొమ్మును ఆరగించే ఇలాంటి సంస్థల్ని కఠినంగా శిక్షించాల్సిన అగత్యం ఎంతైనా ఉంది.

ఋణ హామీ పొందిన నీరవ్ మోదీ 180రోజుల తర్వాత ఋణాన్ని చెల్లించాల్సి ఉంది. అలాకాకుండా ఆ ఋణ ఖాతాను అలాగే పునరుద్ధరించడం ఎంతైనా శోచనీయం. ఇక్కడే బ్యాంకింగ్ అధికార్లను తన మేధస్సుతో బురిడీ కొట్టించి ప్రజల సొమ్ముతో పండగ చేసుకొన్నాడు నీరవ్‌మోదీ. 2011 నుండి కాలం చెల్లిన ఋణాల్ని తిరిగి చెల్లించకుండా అన్ని లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్‌లను పునరుద్ధరిస్తూ పోవడం వెనుక ఆంతర్యం నీరవ్‌మోదీ అందించిన వజ్రాల మహత్యం కాక మరేమిటుంటుంది? నీరవ్ మోదీకి హామీ ఋణాల్ని అందించిన అధికారి ఉద్యోగ విరమణ పొందేదాకా బయట పడకపోవడం వెనుక అవినీతి ఎంత ప్రముఖ పాత్ర వహిస్తున్నదో అర్థం అవుతున్నది. కొత్తగా నియమితులైన అధికారి ఒక్కసారిగా ఉలిక్కిపడి స్టాక్‌ఎక్స్ఛేంజ్ మరియు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు రంగు బయటపడింది. ఎప్పటిలాగే ప్రభుత్వం ఇంతపెద్ద స్కాంలో ఎలా వ్యవహరిస్తుందో కాలమే నిర్ణయించాలి. ప్రజల సొమ్మును ఏ మాత్రం జాగ్రత్తగా కాపాడలేని బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లపై చర్యలకు ఉపక్రమిస్తుందో లేదో చూడాలి.

ప్రజల సొత్తును పప్పు బెల్లాలుగా పంచుకొంటున్న బ్యాంకు అధికార్ల మోసానికి అడ్డుకట్ట వేయలేని ఆడిట్, నిఘా వ్యవస్థల్లో మనం మనగల్గడం ఎంతవరకు సాధ్యమో ఆందోళన కల్గిస్తుంది.

## ఎన్‌బికెఆర్‌లో ప్రాంగణ ఎంపికలు




కోట మండలం విద్యానగర్ లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం చెన్నైకి చెందిన సదర్‌లాండ్ అనే సాఫ్ట్‌వేర్ సంస్థ ఇఇఇ, ఇసిఇ, సిఎస్ఇ, మెకానికల్ విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. ఈ ఎంపికల కోసం హెచ్ఆర్ మేనేజర్‌లు దివ్య, జాహ్నవి పాల్గొని విద్యార్థులకు ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్య తమ సంస్థ వివరాలను తెలిపారు. ప్రస్తుతం సంస్థలో 38 వేలమంది దాకా పనిచేస్తున్నారని, సాంకేతిక నైపుణ్యం ఉన్న మరికొందరు విద్యార్థులను కూడా ఎంపిక చేసుకోనున్నామని తెలిపారు. కాగా, ఈ ఎంపికలకు మొత్తం 180 మంది విద్యార్థులు హాజరయ్యారు. కళాశాల సంచాలకులు డా.వి.విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రాంగణ ఎంపికల అధికారి డా.ఎన్. కిషొంధర్ పాల్గొన్నారు.




### టిఎస్సార్ నేతృత్వంలో..

# ఆశాభోస్లేకు యష్‌చోప్రా అవార్డు

### ముంబైలో కన్నులపండుగగా అవార్డు పండుగ

విఖ్యాత గాయని ఆశాభోస్లేకు ఎంతో ప్రతిష్టాత్మకమైన 5వ యష్‌చోప్రా జాతీయ స్మారక అవార్డు-2018ని బహుకరించి కళాబంధు, రాజ్యసభ సభ్యుడు టి.సుబ్బరామిరెడ్డి తన కళాభిమానాన్ని మరోసారి చాటుకున్నారు. ఇటీవల ముంబైలో జరిగిన ఈ అవార్డు పండుగ కన్నులపండుగగా జరిగింది. గత ఏడు దశాబ్దాలుగా సంగీత సామ్రాజ్యంలో ఎలకోయిల రాగాలతో పల్లవిస్తూ సంగీతానికే మాధుర్యం తెచ్చిన మధురగాయని ఆశాభోస్లేకి ఈ ప్రతిష్టాత్మక అవార్డును బహుకరించడం పట్ల సినీరంగం హర్షధ్వానాలు తెలియజేసింది. సినీప్రపంచంలో ఇప్పటిదాకా 20 భాషల్లో సుమారు 11వేలకు పైగానే పాటలు పాడి ఎన్నో అవార్డులను సాధించి, అరుదైన రికార్డ్‌లను సృష్టించి జాతీయస్థాయిలోనే కాక, అంతర్జా




తీయస్థాయిలో సైతం పాటను విశ్వవ్యాప్తం చేసిన విఖ్యాత గాయనిగా ఆశాభోస్లే ప్రఖ్యాతిచెందిన విషయం అందరికీ తెలిసిందే. అలాంటి విశిష్టమైన గాయనికి టిఎస్సార్ ఫౌండేషన్‌వారు ప్రతిష్టాత్మకమైన యష్‌చోప్రా అవార్డును ప్రదానం చేయడం పట్ల అన్ని రంగాల వారిలోనూ, అందరిలోనూ సంతోషం వ్యక్తమవుతోంది. ప్రత్యేకించి టి.సుబ్బరామిరెడ్డి సారథ్యంలో టిఎస్సార్ ఫౌండేషన్‌వారు చేస్తున్న ఇలాంటి విశిష్ట కార్యక్రమాలు దేశవ్యాప్తంగా అందరి ప్రశంసలందుకుంటున్నాయి. ఈ అవార్డుతో పాటు అవార్డు గ్రహీత ఆశాభోస్లేకు 10లక్షల రూపాయల నగదు బహుమతిని కూడా అందజేసి, ఆ విఖ్యాత గాయనిని ఘనంగా సత్కరించారు.

ముంబైలోని ఒక స్టార్‌హోటల్‌లో అత్యంత వైభవంగా టి.సుబ్బరామిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న



జరిగిన ఈ అవార్డు ప్రదాన కార్యక్రమంలో ఎంతోమంది ప్రముఖులు, సినీ దిగ్గజాలు, సినీ నటులు, నటీమణులు, ప్రముఖ కళాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలుత ఆశాభోస్లేను అందరి హర్షధ్వానాల మధ్య టిఎస్సార్ ఘనంగా సన్మానించి అవార్డును బహుకరించగా, మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావు, ప్రముఖ బాలివుడ్ సినీనటి రేఖ తదితర ప్రముఖులు ఆశాభోస్లేను ఆత్మీయంగా సన్మానించారు. ప్రఖ్యాత సినీనటి రేఖ ఈ సందర్భంగా ఆశాభోస్లేకు పాదనమస్కారం చేసి, కౌగలించుకుని ఆశాభోస్లేపై తనకున్న ఆత్మీయతను చాటుకున్నారు. ఈ అవార్డు అందుకుంటున్నందుకు తన అభినందనలు తెలిపారు. హటాత్తుగా.. ఎంతో ఉద్విగ్న భరితంగా జరిగిన ఈ సన్నివేశం అక్కడున్న వారందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. వారిరువురి ఆత్మీయతను చూసి అందరూ మంత్రముగ్ధులయ్యారు. ప్రముఖ గాయని అల్కాయాగ్నిక్, జాకీష్రాఫ్, పర్నీతి చోప్రా, పూనమ్‌దిల్లాన్‌తో పాటు ప్రముఖ సినీనటి జయప్రద తదితరులు ఈ సందర్భంగా వారిరువురికి ఒకరిపై ఒకరికి ఉన్న అభిమానాన్ని చూసి ఆనందించారు. కాగా, గతంలో ఈ ప్రతిష్టాత్మక అవార్డును సినీ రంగంలో విశేషఖ్యాతినందుకున్న విఖ్యాత గాయని లతామంగేష్కర్, అమితాబ్‌బచ్చన్, రేఖ, షారుఖ్‌ఖాన్‌లకు లభించింది. యష్ చోప్రా సతీమణి పమీలాచోప్రా, సినీదిగ్గజాలు బోనీకపూర్, మాధుర్ బండార్కర్, గాయని అల్క యాగ్నిక్, ఇంకా సినీప్రముఖులు పద్మినీ కొల్హాపూర్, స్క్రిప్ట్‌రైటర్ హనీ ఇరానీ, అను, శశిరంజన్ తదితరులు ఈ అవార్డుకమిటీలో జ్యూరీమెంబర్లుగా ఉన్నారు. ఈ ఏడాది ఈ విశిష్టమైన అవార్డును ఆశాభోస్లేకి అందజేయడం ద్వారా టిఎస్సార్ ఫౌండేషన్ తన కళాభిమానాన్ని, ప్రత్యేకించి సంగీతరంగంపై ఉన్న విశేష అభిమానాన్ని చాటుకున్నట్లయింది.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com